

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం


సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 124 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | ఆదివారం 10 నవంబర్ 2024 | వెల : 4/-

## హుజూరాబాద్‌లో
# ఉద్రిక్తత



- అస్వస్థతకు గురైన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి..
- రెండో విడత దళిత బంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కౌశిక్ రెడ్డి ధర్నా
- అనుమతి లేకుండా వందలాది ఒక్కసారిగా అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకోవడంతో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం
- ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.
- హుటాహుటిన ఆయన్ను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు



## పితృస్వామ్యమే అడ్డుపడితే ఇందిరాగాంధీ ప్రధాని ఎలా కాగలిగారు?

- నిర్మలా సీతారామన్
- పితృస్వామ్యం అనేది వామపక్షాలు కనిపెట్టిన భావన అన్న కేంద్రమంత్రి
- అద్భుతమైన పదికట్టు పదాలకు మోసపోవద్దని సూచన
- పితృస్వామ్యం మీ కలలను సాధించకుండా నిలువరించలేదని వ్యాఖ్య

# మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- తాము ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైంది
- చాన్నాళ్ల తర్వాత గొంతుక వినిపించిన కేసీఆర్
- తమకు కూడా తిట్టడం వచ్చున్న బీఆర్ఎస్ చీఫ్
- ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులను ప్రజలు క్షుణ్ణంగా గమనిస్తున్నారు
- సీఎం టార్గెట్‌గా సంచలన కామెంట్స్..



సిద్దిపేట

చాలా గ్యాప్ తరువాత పార్టీ కార్యకర్తలతో మాట్లాడిన గులాబీ దళపతి కేసీఆర్ సంచలన కామెంట్స్ చేశారు. ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో మాట్లాడిన కేసీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం గురించి తనదైన శైలిలో కామెంట్స్ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు పూర్తయ్యిందని.. ప్రజలు ఏం కోల్పోయారో వారికి అర్థమైందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులను ప్రజలు క్షుణ్ణంగా గమనిస్తున్నారని గులాబీ - మిగతా3లో

## పాక్‌లోని క్వెట్టా రైల్వే స్టేషన్‌లో
# బాంబు పేలుడు

- 20 మంది మృతి
- బలూచిస్థాన్ రాజధాని క్వెట్టాలో ఆత్మాహుతి దాడి!
- తీవ్రంగా గాయపడిన మరో 30 మంది
- పేలుడు సమయంలో ప్లాట్‌ఫాంపై 100 మంది ప్రయాణికులు
- గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి విషమం



# కుల గణనపై మీ వైఖరేంటి!

- కులగణనకు బీజేపీ అనుకూలమో కాదో ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ చెప్పాలి
- దేశవ్యాప్తంగా సర్వే చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారో? లేదో చెప్పాలి
- సర్వే అడ్డుకోవాలని చూస్తే లక్ష్మణ్ ద్రోహిగా మిగిలిపోతారు
- స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలా?
- కులగణనపై మంత్రి పొన్నం ప్రభాకర్ షాకింగ్ కామెంట్స్

హైదరాబాద్

కులగణనకు బీజేపీ అనుకూలమా కాదా ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ డా. లక్ష్మణ్ చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశవ్యాప్తంగా సర్వే చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెస్తారా లేదా అని నిలదీశారు. తెలంగాణలో కులగణన సర్వేపై లక్ష్మణ్ అభిప్రాయం చెప్పాలని ప్రశ్నించారు. ఇవాళ(శనివారం)గాంధీ భవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశం నిర్వహించారు, ఈ సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల కోసం కులగణన జరుపుతున్నామని బీజేపీ నేతలు అంటున్నారని అన్నారు. సర్వేను అడ్డుకోవాలని చూస్తే లక్ష్మణ్ ద్రోహిగా మిగిలిపోతారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు.
స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలా వద్దా అని నిలదీశారు. బీజేపీ ఎన్నికల్లో పూర్తిగా మతం రంగును - మిగతా3లో



## భారత పరిశ్రమలకు రతన్ టాటా
# ఎప్పటికీ ప్రేరణగా నిలుస్తారు

- యువతకు రతన్ ప్రేరణగా నిలిచారు : ప్రధాని నరేంద్ర మోదీ..
- భారతీయ సంప్రదాయాలను ఎందరికో పరిచయం చేశారు
- రతన్ నాయకత్వంలో టాటా గ్రూపు కొత్త తీరాలకు వెళ్లింది
- విశ్వాసం, గౌరవం, నమ్మకాన్ని ఆ సంస్థ పొందింది.



## 26 రోజుల పాటు ప్రజా విజయోత్సవాలు

- నవంబర్ 14 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రజా విజయోత్సవాలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క
- ప్రజా విజయోత్సవాలపై భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం
- విధివిధానాల రూపకల్పనకు సమావేశం
- ప్రజా విజయోత్సవాలకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసిన సబ్ కమిటీ



హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్న నేపథ్యంలో నవంబర్ 14 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రజా విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజా విజయోత్సవాల నిర్వహణపై భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. ప్రజా విజయోత్సవాలు ఏ విధంగా జరపాలి? ఏ అంశాలపై ప్రచారం చేయాలి? అనే దానిపై విధివిధానాలను రూపొందించేందుకు సమావేశమయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా.. పెద్దఎత్తున ఉత్సవాలు నిర్వహించాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. ఇందులో భాగంగా.. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 9 వరకు 26 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా విజయోత్సవాలను నిర్వహించనున్నారు. - మిగతా3లో



## అగ్రరాజ్యాల సరసన భారత్ ఉండాలి

- దేశాల కంటే వేగంగా అభివృద్ధి భారతదేశ చెందుతోంది
- రష్యా అన్ని రంగాల్లో భారత్‌తో సంబంధాలను పటిష్టం చేసుకుంటోంది
- ఇరు దేశాల మధ్య సంబంధాలపై ఒకరికొకరు లోతైన బంధం ఉంది
- 1.5 బిలియన్ల జనాభాతో, ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్
- ప్రాచీన సంస్కృతి, భవిష్యత్తు అభివృద్ధికి అపారమైన సామర్థ్యం
- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్

# బీజేపీని ఓడించండి

- మరాఠ ఓటర్లకు రేవంత్ పిలుపు
- దేశంలోని మహారాష్ట్రలో ఎక్కువ మంది రైతు ఆత్మహత్యలు జరిగాయి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని పూర్తిగా మరిచారు
- కేంద్రం తీసుకొచ్చిన నల్ల చట్టాలు వల్ల అదానీ, అంబానీలకు మేలు చేయాలని ప్రధాని మోదీ భావించారు
- మహారాష్ట్రకు రావాల్సిన 17 మెగా ప్రాజెక్టులు ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్‌కు తరలించుకుపోయారు



ముంబై

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల మధ్య ప్రచారం వేడెక్కింది. ఒకరిపై మరొకరు మాటల యుద్ధం తీవ్రతరం చేశారు. లేటెస్ట్ గా ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలపై మరోసారి ఫైర్ అయ్యారు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి. మిమ్మల్ని మోసం చేసిన బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలంటూ మహారాష్ట్ర ఓటర్లకు పిలుపు నిచ్చారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి ముంబై వెళ్లారు సీఎం రేవంత్‌రెడ్డి. పార్టీ ఆఫీసులో మీడియాతో మాట్లాడారు. దేశంలోని మహారాష్ట్రలో ఎక్కువ మంది రైతు ఆత్మహత్యలు జరిగాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని పూర్తిగా మరిచారన్నారు.కేంద్రం తీసుకొచ్చిన నల్ల చట్టాలు వల్ల అదానీ, అంబానీలకు మేలు చేయాలని ప్రధాని మోదీ - మిగతా3లో

# కాంగ్రెస్ పార్టీ అంతా అవినీతి మయం



**అకోలా :** ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా ఆ రాష్ట్రం పార్టీ 'షాహీ పరివార్'కు ఎటిఎంగా మారుతుంటుందని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఆరోపించారు. ఈ నెల 20 నాటి మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి అకోలాలో ఒక ప్రచారం ర్యాలీలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఎటిఎం కానివ్వబోమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ అంత ఎక్కువగా అవినీతికి పాల్పడుతున్నప్పుడు అధికారంలో ఉంటే ఆ పార్టీ ఎంత అవినీతిమయంగా ఉంటుందో ఎవరైనా ఊహించుకోవచ్చునని ప్రధాని అన్నారు. 'కాంగ్రెస్ ఎక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసినా ఆ రాష్ట్రం పార్టీ షాహి పరివార్‌కు ఎటిఎంగా మారిపోతుంది. మహారాష్ట్ర ఎన్నికల కోసం (కాంగ్రెస్ పాలిత) కర్నాటకలోని మద్యం వ్యాపారుల నుంచి రూ. 700 కోట్లు బలవంతంగా వసూలు చేశారు.తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ కూడా ఆ షాహీ పరివార్ ఎటిఎంలుగా మారాయి' అని మోడీ ఆరోపించారు. (మహారాష్ట్రలోని అధికార కూటమి) మహాయుతి మహిళల భద్రత, ఉద్యోగావకాశాలు, లడ్కీ బహిన్ యోజన విస్తరణపై దృష్టి కేంద్రీకరిస్తుండగా, కాంగ్రెస్, శివసేన (యుబిటి), శరద్ పవార్‌కు చెందిన ఎన్‌సిపి (ఎస్‌పి)తో కూడిన మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) 'అవినీతి పత్రం'తో వచ్చిందని ఆయన పేర్కొన్నారు. 'ఎంవిఎ అంటే అవినీతి, టోకెన్ డబ్బు, బదలీ నియామక వ్యాపారం అనేదని మొత్తం దేశానికి తెలుసు' అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్‌ను ప్రధాని మరింతగా తూర్పారపడుతూ, పార్టీ షాహీ పరివార్ ఎన్నడైనా బాబాసాహెబ్ అంబేద్కర్ 'పంచ్‌తీర్థ్'ను సందర్శించారా అని తాను సవాల్ చేస్తున్నానని చెప్పారు. మధ్య ప్రదేశ్‌లోని మ్హోలోని అంబేద్కర్ జన్మస్థలం, యుకెలో ఆయన చదువుకున్నప్పుడు లండన్‌లో ఆయన బస చేసిన ప్రదేశం, నాగ్‌పూర్‌లో ఆయన బౌద్ధమతం స్వీకరించిన దీక్ష భూమి, ఢిల్లీలోని ఆయన 'మహాపరినిర్వాణ్ స్థల్', ముంబయిలోని 'చైత్య భూమి'ని ఉద్దేశించి మోడీ 'పంచ్‌తీర్థ్' పదం ప్రస్తావించారు. 'బాబాసాహెబ్ దళితుడు కనుక, రాజ్యాంగం రూపకల్పన ఘనత ఆయనకు దక్కినందున ఆయనను వారు ద్వేషిస్తారు. బాబాసాహెబ్ నాకు, బిజెపి, నా ప్రభుత్వానికి ఒక స్ఫూర్తిదాత. ఆయన వారసత్వ సంపదకు సంబంధించిన ప్రదేశాలను మా ప్రభుత్వం అభివృద్ధి చేసింది. మా యుపిఐకి భీమ్ యుపిఐ అని నామకరణం చేశాను' అని మోడీ తెలియజేశారు. కులాలు, మతాలను పరస్పరం వైరి వర్గాలుగా మార్చడం, దళితులు, వెనుకబడిన వర్గాలు సమైక్యం కాకుండా నిరోధించడం కాంగ్రెస్ గేమ్ ప్లాన్ అని, అయితే, 'ఏక్ హై తో సేఫ్ హై' (మనం ఐక్యమైతే భద్రంతా ఉంటాం) అనే మంత్రాన్ని అనుసరించి హర్యానా ప్రజలు ఆ కుట్రను భగ్నం చేశారని మోడీ అన్నారు.దేశం దుర్బలంగా ఉంటేనే తాను పటిష్ఠం కాగలనని కాంగ్రెస్‌కు తెలుసు అని ఆయన పేర్కొన్నారు. గడచిన రెండు విడతలలో తన ప్రభుత్వం నాలుగు కోట్ల మందిపేద ప్రజలకు ఇళ్లు సమకూర్చ గలిగిందని, మరి మూడు కోట్ల ఇళ్లు నిర్మించనున్నదని మోడీ తెలిపారు, తన మూడవ విడతలో మహారాష్ట్రలోని వాధవాన్ రేవుతో సహా అనేక లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోందని, అది పూర్తి అయితే దేశంలోనే అతి పెద్దది అవుతుందని ప్రధాని మోడీ చెప్పారు.

# భారత పరిశ్రమలకు రతన్ టాటా ఎప్పటికీ ప్రేరణగా నిలుస్తారు



**న్యూఢిల్లీ:** టాటా సంస్థల అధినేత రతన్ టాటా మృతిచెంది నెల రోజులు కావస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ.. ఓ ఆర్టికల్ రాశారు. దిగ్గజ వ్యాపారవేత్త రతన్ టాటాకు తన వ్యాసంతో నివాళి అర్పించారు. సమాజంలోని అన్ని రంగాలు రతన్ టాటా లేని లోటును ఫీలవుతున్నాయన్నారు. సీజనల్ వ్యాపారవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ప్రొఫెషనల్స్ ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణం, దాతృత్వం పట్ల శ్రద్ధ ఉన్నవాళ్లు కూడా రతన్ మృతితో విషాదంలో ఉన్నట్లు రాశారు. ఈ దేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా రతన్ మరణం అందర్నీ కలిచివేసిందన్నారు. యువతకు రతన్ ప్రేరణగా నిలిచారన్నారు. భారతీయ సంప్రదాయాలను ఎందరికో పరిచయం చేశారని, సమగ్రతకు.. సేవకు ఆయన కట్టుబడి ఉన్నట్లు మోడీ తెలిపారు. రతన్ నాయకత్వంలో టాటా గ్రూపు కొత్త తీరాలకు వెళ్లిందన్నారు. విశ్వాసం, గౌరవం, నమ్మకాన్ని ఆ సంస్థ పొందిందన్నారు. సాధించిన ఘనతల పట్ల ఆయన వినయంగా ఉండేవారన్నారు. మరొకరి ఆశయాలకు మద్దతు ఇవ్వడం ఆయన ఉత్తమ లక్షణమన్నారు. భారత్‌లో స్టార్టప్ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడంతో రతన్ టాటా మెంటర్‌గా వ్యవహరించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. స్టార్టప్‌లకు ఊతం ఇవ్వడం వల్ల.. ఆవిష్కరణలు, పారిశ్రామీకరణల్లో కొత్త సంస్కృతి ఏర్పడిందన్నారు. రతన్ చూపిన పాజిటివ్ సంకేతం .. రాబోయే దశాబ్ధాల్లో ఇండియాను మరింత తీర్చిదిద్దుతుందని ఆశిస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు.

ప్రపంచస్థాయికి తగ్గట్లుగా బెంచ్‌మార్క్‌లను సెట్ చేయాలని భారతీయ వ్యాపారవేత్తలను రతన్ ప్రోత్సహించినట్లు ప్రధాని తన వ్యాసంలో వెల్లడించారు. ప్రపంచ స్థాయి సదుపాయాలు కల్పించడంలో.. రతన్ విజన్.. భారత భవిష్యత్తు నాయకులకు ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తుందని ఆశించారు. బోర్డురూమ్‌లకో లేక మనుషులకు సాయం చేయడమే కాదు.. ఆయన గొప్ప జంతు ప్రేమికుడు అని కూడా తెలిపారు. రతన్ తన శునకానికి చెందిన ఫోటోను ఎప్పుడూ అప్‌డేట్ చేసేవారన్నారు. గొప్ప నాయకుడిని తన సక్సెస్‌ను బట్టి అంచనా వేయడం కాదు అని, ఆ వ్యక్తి నిస్సహాయులను ఆదుకున్న సామర్థ్యాన్ని బట్టి అంచనా వేస్తారన్నారు. అత్యంత క్లిష్ట సమయాల్లో రతన్ టాటా తనలోని దేశభక్తిని చాటారన్నారు. కోట్లాది మంది భారతీయుల ఆ దేశభక్తిని ప్రత్యక్షంగా తిలకించినట్లు చెప్పారు. ముంబై దాడుల తర్వాత తాజ్ హెూటల్ రీఓపెన్ చేసిన తీరు దేశానికి మేలుకొలుపు వంటిదన్నారు. భారత్ ఐక్యంగా ఉన్నదని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తమ పోరాటాన్ని ప్రదర్శించినట్లు మోదీ తెలిపారు. రతన్ వ్యక్తిగతంగా తనకు ఎన్నో ఏళ్లుగా తెలుసు అని, గుజరాత్‌లో కలిసి పనిచేశామన్నారు. అక్కడ ఆయన ఎన్నో ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టినట్లు చెప్పారు. కొన్ని రోజుల క్రితం స్పెయిన్ ప్రెసిడెంట్‌తో కలిసి వడోదరలో సీ-295 విమాన తయారీ కాంప్లెక్స్‌ను ఓపెన్ చేసినట్లు తెలిపారు. రతన్ టాటానే ఆ కాంప్లెక్స్ గురించి ప్లాన్ వేశారన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ ఓపెనింగ్ సమయంలో రతన్ లేకపోవడం శోచనీయమన్నారు.

రతన్ టాటా తనకు రెగ్యులర్‌గా లేఖలు రాసేవారన్నారు. ప్రభుత్వ పాలన అయినా లేక శుభాకాంక్షల సందేశాలైనా.. ఆయన క్రమంగా లేఖలు రాసేవారని ప్రధాని తెలిపారు. తమ సర్కారు చేపట్టిన స్వచ్ఛ భారత్ మిషన్‌కు రతన్ టాటా మంచి సపోర్టు ఇచ్చినట్లు తెలిపారు. దేశ ప్రగతిలో పరిశుభ్రత, స్వచ్ఛత, శానిటేషన్ చాలా కీలకమైనవని రతన్ నమ్మేవారన్నారు. హెల్త్‌కేర్ అంశంలోనూ ఆయన రాజీలేని పోరాటం చేశారన్నారు. క్యాన్సర్‌పై పోరాటంలో భాగంగా అస్సాంలో అనేక ఆస్పత్రులను ఓపెన్ చేసినట్లు చెప్పారు. ఆరోగ్యం, క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి తెవాలన్న ఆశయం రతన్‌లో ఉన్నట్లు తెలిపారు. భారత్‌ను ఉత్తమ ప్రదేశంగా తీర్చిదిద్దిన ఆయన పట్ల రాబోయే తరాలు కృతజ్ఞతతో ఉంటారన్నారు.

## పాక్‌లోని క్వెట్టా రైల్వే స్టేషన్‌లో బాంబు పేలుడు..




పాకిస్థాన్‌లోని క్వెట్టా రైల్వే స్టేషన్ శనివారం బాంబు పేలుడుతో దద్దరిల్లింది. పెషావర్ వెళ్లేందుకు ప్లాట్‌ఫాంపై రైలు సిద్ధంగా ఉన్న సమయంలో ఈ ఘటన జరిగింది. పేలుడులో 20 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు తీవ్రతకు మృతదేహాలు ఎగిరిపడ్డాయి. ఇది ఆత్మాహుతి దాడిలా అనిపిస్తోందని, అయితే నిర్ధారించాల్సి ఉందని క్వెట్టా సీనియర్ ఎస్పీ తెలిపారు. దర్యాప్తు కొనసాగుతున్నట్టు చెప్పారు. బాంబు పేలిన సమయంలో ప్లాట్‌ఫాంపై దాదాపు 100 మంది ఉన్నట్టు ఎస్సెస్పీ తెలిపారు. క్వెట్టా నుంచి రావల్పిండి వెళ్లేందుకు ప్రయాణికులు ప్లాట్‌ఫాంపై వేచి ఉన్న సమయంలో ఈ ఘటన జరిగినట్టు సీనియర్ పోలీస్ అధికారి ఒకరు పేర్కొన్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. పాకిస్థాన్‌లో అత్యంత పేద ప్రావిన్స్ అయిన బలూచిస్థాన్ వేర్పాటువాదులకు అడ్డాగా మారింది. అక్కడి ఉగ్రవాద సంస్థ బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) గతంలోనూ పలుమార్లు దాడులకు పాల్పడింది. పాక్ ఆర్మీ, ఇతర ప్రావిన్సుల్లోని పాకిస్థానీలపై తరచూ దాడులు చేస్తూ ఉనికి చాటుకుంటోంది. ఈ ఏడాది ఆగస్టులో 39 మందిని దారుణంగా హత్య చేసింది. ఇటీవలి కాలంలో ఇదే అతిపెద్ద దాడి.

## 86ఫిల్మ్ నగర్లో ఆక్రమణలను తొలగించినా హైడ్రా

**హైదరాబాద్ :** ఫిల్మ్ నగర్ లో అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు శనివారం కూల్చివేసారు. ఫిలింనగర్ ప్రధాన రహదారి కలిసిన ఫిల్మ్ నగర్ రహదారి 9 కలిసిన చోట ఆక్రమించి నిర్మించిన కట్టడం పై హైడ్రాకు స్థానికులు ఫిర్యాదు చేసారు. ఫిలింనగర్ లేఅవుట్ ను హైడ్రా అధికారులు పరిశీలించారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు జరిగినట్టు నిర్ధారించారు. అదే స్థలానికి అనుకుని వున్న యిల్లు ప్రహరీ కూడా ఆక్రమించి నిర్మించినట్టు నిర్ధారణ అయింది.

# సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైల్స్

**ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన మధ్యప్రదేశ్ పోలీసులు**



భోపాల్ పోలీస్ కమిషనర్ పేరిట సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైల్స్ సృష్టించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిని షకీల్ మహ్మద్, సునిల్ ప్రజాపత్ అని పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ ఫేస్‌బుక్ ఫేక్ ప్రొఫైల్స్ సృష్టిస్తున్నారు. వీరిని రాజస్థాన్ లోని అల్వార్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటకలోనూ ఒక జిల్లా ఎస్పీ పేరిట నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించినందుకు కర్ణాటక పోలీసులకు వీరిద్దరు 'వాంటెడ్' ఉన్నారు. వీరు సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైల్స్ క్రియేట్ చేసిన సంగతి ఒక వ్యాపార వేత్త సైబర్ సెల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తేనే తెలిసింది. భోపాల్ కు చెందిన 45 ఏండ్ల వ్యాపార వేత్త సైబర్ క్రైమ్ పోలీసులకు ఈ నెల ఐదో తేదీన ఫిర్యాదు చేశారు. భోపాల్ పోలీస్ కమిషనర్ హరి నారాయణ చారి మిశ్రా యూనిఫామ్‌తో కూడిన ఫోటో గల ఫేస్‌బుక్ ఖాతా నుంచి తనను రూ.45 వేలకు మోసగించారని వ్యాపార వేత్త ఫిర్యాదు చేశారు. తన పాత ఆస్తిని విక్రయించమని భోపాల్ పోలీస్ కమిషనరేట్ నుంచి ఫోన్ కాల్ వచ్చిందని తెలిపారు. ఇందుకోసం తాను క్యూఆర్ కోడ్ ద్వారా రూ.45 వేలు చెల్లించానని సదరు వ్యాపారవేత్త తెలిపారు. భోపాల్ సైబర్ క్రైమ్ పోలీసు విభాగం డీసీపీ అఖిల్ పటేల్ స్పందిస్తూ ఈ కేసు తదుపరి దర్యాప్తుపై నిందితులిద్దరిని కస్టడీ కోసం రిమాండ్ చేయాలని కోరతామన్నారు. వారి వద్ద నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, మూడు సిమ్ కార్డులు, రూ.5000 నగదు జప్తు చేశామని పోలీసులు తెలిపారు.

# కలిసొచ్చే పార్టీలతో దోస్తీకి సిద్ధం



**చెన్నై:** రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరుగనున్న ఎన్నికల్లో భావసారూప్యత కలిగిన పార్టీలతో చేతులు కలిపేందుకు తమిళగ వెట్రి కళగం (టీవీకే) సిద్ధమైంది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత విజయ్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అగ్రనటుడిగా రాణిస్తున్న విజయ్ ప్రారంభించిన టీవీకే తొలి మహానాడు ఇటీవల విల్లుపురం జిల్లా విక్రవాండిలో విజయవంతంగా జరిగిన విషయం తెలిసిందే. ఈ మహానాడులో రాష్ట్రంలో అధికారంలో ఉన్న డీఎంకే, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలను విజయ్ తీవ్రంగా విమర్శించారు. దానికి ఈ రెండు పార్టీల నేతలు ఖండించారు. ఈ నేపథ్యంలో 2026లో రాష్ట్ర అసెంబ్లీకి జరుగబోయే ఎన్నికలకు అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే సహా అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఎన్నికలకు 15 నెలల గడువున్నప్పటికీ, కూటమిపై దృష్టి సారించిన పార్టీలు ప్రజాదరణ పొందిన పార్టీలతో పొత్తు కుదుర్చుకొనే ప్రయత్నాల్లో దిగాయి. పార్టీ తొలి మహానాడులో ప్రసంగించిన విజయ్.. అసెంబ్లీ ఎన్నికల్లో తమ నాయకత్వాన్ని అంగీకరించే పార్టీలతో దోస్తీ కడతానని వెల్లడించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా అధికారంలో కూడా మిత్రపక్షాలకు భాగస్వామ్యం కల్పిస్తామని ప్రకటించారు. ఈ ప్రకటనతో విజయ్‌తో పొత్తు కుదుర్చుకొనేందుకు కొన్ని పార్టీలు నిర్ణయం తీసుకున్నప్పటికీ, దీనిపై బహిరంగ ప్రకటన చేయలేదు. ఇదిలా ఉండగా, టీవీకే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర పార్టీల నాయకత్వం కింద పనిచేసేందుకు ఇష్టపడదని, తమ సిద్ధాంతాలకు కట్టుబడి తమ నాయకత్వాన్ని అంగీకరించే పార్టీలతోనే విజయ్ పొత్తు కుదుర్చుకుంటారని టీవీకే సీనియర్లు చెబుతున్నారు.

## అగ్రరాజ్యాల సరసన భారత్ ఉండాలి



**న్యూఢిల్లీ :** భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఇతర దేశాల కంటే వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచ అగ్రరాజ్యాల జాబితాలో చేర్చడానికి భారతదేశం పూర్తిగా అర్హుడని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. రష్యాలోని సోచి నగరంలో వాల్‌డై డిస్కషన్ క్లబ్' సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే రష్యా అన్ని రంగాల్లో భారత్‌తో సంబంధాలను పటిష్టం చేసుకుంటోందని, ఇరు దేశాల మధ్య సంబంధాలపై ఒకరికొకరు లోతైన బంధం ఉందని పుతిన్ అన్నారు. 1.5 బిలియన్ల జనాభాతో, ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్. ప్రాచీన సంస్కృతి, భవిష్యత్తు అభివృద్ధికి అపారమైన సామర్థ్యం ఉన్న భారతదేశాన్ని నిస్సందేహంగా అగ్రరాజ్యాల జాబితాలో చేర్చాలని పుతిన్ అభిప్రాయపడ్డారు.భారత్‌ను గొప్ప దేశంగా అభివర్ణించిన పుతిన్.. రష్యా అన్ని రంగాల్లో భారత్‌తో సహకారాన్ని పెంచుకుంటుందని, దీంతో ఇరు దేశాల మధ్య విశ్వాస వాతావరణం నెలకొంటోందని అన్నారు. భారతదేశ జనాభాకు సంబంధించి, భారతదేశం 1.5 బిలియన్ల జనాభాతో మరియు ప్రతి సంవత్సరం 1 కోటి జనాభాతో ప్రపంచంలోనే అతిపెద్ద దేశంగా ఉందని ఆయన అన్నారు. భారతదేశ ఆర్థిక పురోగతిపై, ఈ రంగంలో భారతదేశం ప్రపంచానికి ముందుందని అన్నారు.భారత్, రష్యాల మధ్య సంబంధాలపై స్పందించిన పుతిన్.. మన సంబంధాలు ఏ దిశలో, ఏ వేగంతో పెరుగుతాయనేది పూర్తిగా వాస్తవికతపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. తమ సహకారం ప్రతి సంవత్సరం అనేక రెట్లు పెరుగుతోంది. ఇరుదేశాల మధ్య రక్షణ సహకారాన్ని పుతిన్ ప్రస్తావిస్తూ.. దీన్ని బట్టి రెండు దేశాల మధ్య సంబంధాలు ఎంత దృఢంగా ఉన్నాయో అంచనా వేయవచ్చని అన్నారు.భారత సైన్యంలో అనేక రకాల రష్యా ఆయుధాలు వాడుతున్నారని, దీన్ని బట్టి ఇరు దేశాల సంబంధాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చునని పుతిన్ అన్నారు. రష్యా భారత్‌కు ఆయుధాలను విక్రయించడమే కాకుండా సాంకేతిక సహకారాన్ని కూడా అందిస్తుంది. దీని వల్ల భారత్ సైనిక సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు. బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణిని ఉదాహరణగా చెబుతూ.. భారత్, రష్యాలు సంయుక్తంగా దీన్ని రూపొందించాయని చెప్పారు. బ్రహ్మోస్ క్షిపణిని వాయు, సముద్రం, భూమి అనే మూడు రకాల వాతావరణాల్లో వినియోగించేలా రూపొందించామని చెప్పారు. భారత్‌తో కలిసి ఈ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయని పుతిన్ చెప్పారు.రెండు దేశాల ఉమ్మడి ప్రాజెక్టుల వల్ల మరే ఇతర దేశానికి ఎలాంటి ఇబ్బంది కలగకూడదని రష్యా అధ్యక్షుడు అన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి ప్రాజెక్టులపై ఇరు దేశాలు పనిచేస్తాయని, ఇది తమ మధ్య విశ్వాసం మరియు సహకారాన్ని మరింత పెంపొందిస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పుతిన్ భారత్-చైనా సంబంధాలపై కూడా మాట్లాడుతూ రెండు దేశాల మధ్య కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, అయితే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

## పితృస్వామ్యమే అడ్డుపడితే ఇందిరాగాంధీ ప్రధాని ఎలా కాగలిగారు?



మన దేశంలో మహిళలు ఎదగకుండా పితృస్వామ్య వ్యవస్థ అడ్డుపడిందే నిజమైతే ఇందిరాగాంధీ ప్రధాని ఎలా కాగలిగారని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు. బెంగళూరులో సీఎంఎస్ బిజినెస్ స్కూల్ విద్యార్థులతో జరిగిన సమావేశంలో మహిళా సాధికారత, పితృస్వామ్యంపై ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థి మహిళా సాధికారత గురించి ప్రశ్నించారు. దీనిపై నిర్మలా సీతారామన్ మాట్లాడు తూ... పితృస్వామ్యం అనేది వామపక్షాలు కనిపెట్టిన భావన అన్నారు. అద్భుతమైన పడికట్టు పదాలకు మోసపోవద్దని... లాజికల్‌గా ఉండాలన్నారు. పితృస్వామ్యం మీ కలలను సాధించకుండా నిలువరించదన్నారు. అదే సమయంలో మహిళలకు తగిన సౌకర్యాలు, సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత, అవశ్యకత ఉందని అంగీకరించారు. మోదీ ప్రభుత్వం ఆవిష్కరణలు చేసే వారికి ప్రోత్సాహాన్ని ఇస్తోందన్నారు.

## కోడలును టీవీ చూడనీయక పోవడం క్రూరత్వం కాదు: కోర్టు



**ముంబై:** అత్తింటి వారు కోడలును టీవీ చూడనీయకపోవడం, కార్పెట్‌పై పడుకోమనడం, పొరుగు వారిని కలవనీయకపోవడం వంటివి క్రూరత్వం కాదని కోర్టు పేర్కొంది. భర్త, అతడి కుటుంబ సభ్యులకు దిగువ కోర్టు విధించిన శిక్షలను కొట్టివేసింది. మహారాష్ట్రకు చెందిన ఒక మహిళ అత్తింటి వారిపై ఆరోపణలతో భర్తను వీడి పుట్టింటికి చేరింది. 2002 మే 1న ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, ఆ మహిళను భర్త, అత్తమామలు వేధించారని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. టీవీ చూడనీయలేదని, గుడికి వెళ్లనీయలేదని, పొరుగు వారిని కలవనీయలేదని, కార్పెట్‌పై పడుకోబెట్టారని, తెల్లవారుజామున 1.30 గంటకు సరఫరా అయ్యే మంచి నీరు తెప్పించారంటూ పలు ఆరోపణలు చేశారు. ఈ వేధింపులు భరించలేని ఆమె ఆత్మహత్య చేసుకుని చనిపోయిందంటూ ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన ట్రయిల్ కోర్టు ఆ మహిళ భర్త, అతడి కుటుంబ సభ్యులకు జైలు శిక్ష విధించింది. అయితే ట్రయిల్ కోర్టు తీర్పును బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్‌లో వారు సవాల్ చేశారు. జస్టిస్ అభయ్ ఎస్ వాఘ్వాసే నేతృత్వంలోని సింగిల్ బెంచ్ ధర్మాసనం వారి పిటిషన్‌పై విచారణ జరిపింది. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 498%ూ% ప్రకారం క్రూరత్వ నేరం కింద ఆరోపించిన ఈ చర్యలు తీవ్రమైనవిగా పరిగణించలేమని కోర్టు తెలిపింది. ఇంటి వ్యవహారాలకు సంబంధించిన ఇవి శారీరక, మానసిక క్రూరత్వం కిందకు రావని పేర్కొంది. మరోవైపు మహిళ ఆత్మహత్యకు రెండు నెలల ముందు భర్త, అత్తింటి వారితో ఆమెకు ఎలాంటి మాటలు, రాత పూర్వకంగా కమ్యూనికేషన్ వంటివి లేవని కోర్టు గుర్తు చేసింది. దీంతో వారి క్రూరత్వం వల్లనే ఆమె ఆత్మహత్య చేసుకున్నదన్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొంది. ఈ నేపథ్యంలో భర్త, అతడి కుటుంబ సభ్యులకు దిగువ కోర్టు విధించిన శిక్షలను బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ కొట్టివేసింది.

## ఆ టార్చర్ భరించలేక ఉగ్రవాదిలా మారాలనుకున్నా : నేషనల్ కాన్ఫరెన్స్ ఎమ్మెల్యే

ఆర్మీ అధికారి చిత్రహింసల వల్ల తాను ఉగ్రవాదిలా మారాలనుకున్నానని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఎమ్మెల్యే కైసర్ జంషేద్ లోన్ చెప్పారు. అయితే ఒక సీనియర్ అధికారి మాటల ద్వారా తనకు వ్యవస్థపై నమ్మకం కలిగిందని అన్నారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శుక్రవారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైసర్ జంషేద్ లోన్ సభలో మాట్లాడారు. చిన్నప్పుడు తాను నివసించే ప్రాంతంలో జరిగిన ఓ ఉగ్రవాదుల దాడి గురించి తనతో సహా 32 మంది యువకులను ఆర్మీ అధికారి ప్రశ్నించారని లోన్ తెలిపారు. టెర్రరిస్టుల్లో చేరిన యువకుడు తెలుసా..? అని ఆ అధికారి తనను అడిగితే తెలుసని తాను చెప్పానని, దాంతో ఆ మిలిటరీ అధికారి తనను కొట్టారని ఆయన చెప్పారు. 'ఇప్పుడు జరిగిన ఉగ్రదాడిలో ఆ యువకుడు పాల్గొన్నాడా..?' అని ఆర్మీ అధికారి మరో ప్రశ్న అడిగారని, తాను లేదని చెప్పడంతో మళ్లీ కొట్టారని అన్నారు.

సూర్య



# మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

-మొదటిపేజీ తరువాయి

బాస్ కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు హైరానా కావాల్సిన అవసరం లేదన్నారు. పార్టీపై ప్రజలు చాలా విశ్వాసంతో ఉన్నారన్నారు. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని కేసీఆర్ సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేశారు.

పాలన అంటే ఒట్టి మాటలతో నడిచేది కాదన్నారు కేసీఆర్. అధికారంలోకి రాగానే వాణ్ణి లోపల వేయాలి.. వీన్ని లోపల వేయాలని బీఆర్ఎస్ చూడదన్నారు. 'ప్రభుత్వం అంటే అందరినీ కాపాడాలి. సమసమాజ నిర్మాణం చేయాలి. పది మందికి లాభం చేయాలి. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్నవాళ్లు ఎలా మాట్లాడుతున్నారో.. ఏం చేస్తున్నారో ప్రజలంతా గమనిస్తున్నారు' అని కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై కేసీఆర్ మండిపడ్డారు. అది చేస్తాం.. ఇది చేస్తామని పిచ్చి మాటలు తమకు రావా? అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు మీకు బాధ్యత ఇచ్చింది సేవ చేయడానికా? లేక మాటలతో కాలయాపన చేయడానికా? అని కాంగ్రెస్ ప్రభుత్వం తీరును తూర్పారబట్టారు. తాము తమ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల కంటే 90 శాతం ఎక్కువే అమలు చేశామని కేసీఆర్ గుర్తు చేశారు. అడగని పథకాలు కూడా అమలు చేశామన్నారు.

మాకు కూడా తిట్టడం వచ్చు... రౌడీ పంచాయితీలు చేయడం మాకు కూడా తెలుసు... అధికారం ఇచ్చింది తిట్టడానికి కాదు... ప్రజలు మీకు బాధ్యత ఇచ్చింది సేవ చేయడానికి అని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

"మేం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల కంటే 90 శాతం ఎక్కువ హామీలు అడగకుండానే అమలు చేశాం. చేయలేనివి కూడా



చేస్తామని చెప్పడం మాకు రాదు, తెలియదు. మాకు మాట్లాడడం రాదనుకున్నారా... ఇవాళ మొదలుపెడితే రేపటి వరకు మాట్లాడతా.

ప్రజలను కాపాడాల్సింది పోయి భయపెడతారా? అధికారంలోకి రాగానే వాడ్ని లోపలెయ్యాలి, వీడ్ని లోపలెయ్యాలి అని ఆలోచిస్తారా? అరెస్టులకు భయపడేది లేదు. ప్రజలు మీకు అధికారం ఇచ్చింది బాధ్యతాయుతంగా ప్రజలకు సేవ చేయాలి. ప్రజలు అధికారం ఇచ్చింది కూల్చడానికి కాదు... నిర్మించడానికి.

బీఆర్ఎస్ శ్రేణులు కంగారు పడాల్సిన పనిలేదు.... మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే. ట్రెండ్ చూస్తే... ప్రజలు బీఆర్ఎస్ పై విశ్వాసంతో ఉన్నారన్న విషయం అర్థమవుతోంది" అంటూ కేసీఆర్ వ్యాఖ్యానించారు

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో వందశాతం బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని కేసీఆర్ ఉద్ఘాటించారు. అక్రమ కేసులు ఎన్ని పెట్టిన భయపడాల్సిన పని లేదని పార్టీ శ్రేణులకు భరోసారి ఇచ్చారు గులాబీ దళపతి. అరెస్టులకు, కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. లీగల్‌గా పోరాడుదామని పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. అందరూ కష్టపడి పని చేయాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారాయన. కాగా, శనివారం నాడు పలు పార్టీలకు చెందిన నాయకులు కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రసంగించిన కేసీఆర్.. ఇలా హాట్ కామెంట్స్ చేశారు.

తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తరువాత కేసీఆర్ పూర్తిగా సైలెంట్ అయిపోయారు. పూర్తిస్థాయి ఫలితాలు వెలువడక ముందే.. ఎలక్షన్ రిజల్ట్స్ ట్రెండ్స్ చూసి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లిపోయారు కేసీఆర్. ఆ తరువాత ఇంట్లో పడిపోవడం, ఆస్పత్రిలో ఆపరేషన్, విశ్రాంతి కారణంగా కొన్ని నెలలు ఆయన ప్రజలకు దూరంగా ఉన్నారు. ఎంపీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ తరఫున ప్రచారం నిర్వహించారు. ఆ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాకపోవడంతో తీవ్ర నైరాశ్యానికి గురయ్యారు కేసీఆర్. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఒక రోజు సమావేశానికి హాజరైన కేసీఆర్.. ఆ తరువాత మళ్లీ జాడ లేకుండా పోయారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన ప్రజా క్షేత్రంలోకి వచ్చింది లేదు. వచ్చినా మాట్లాడింది లేదు. కేసీఆర్ తన వ్యవసాయ క్షేత్రంలోనే ఉంటూ.. పార్టీ ముఖ్యనేతలు వచ్చినప్పుడు కలుస్తూ.. వారికి కీలక సూచనలు చేస్తున్నారు. దాదాపు 5 నెలల తరువాత కేసీఆర్ మళ్లీ తన నోరు విప్పి.. పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ విధానాలను తప్పుపడుతూ.. తెలంగాణలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనంటూ తన పార్టీ క్యాడర్‌లో జోష్ నింపే ప్రయత్నం చేశారు.

# హుజూరాబాద్‌లో ఉద్రిక్తత..

**కరీంనగర్:** హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేపట్టిన ధర్నా తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. రెండో విడత దళిత బంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కౌశిక్ రెడ్డి ధర్నా చేపట్టారు. అనుమతి లేకుండా వందలాది ఒక్కసారిగా అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకోవడంతో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యేతో సహా పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హుటాహుటిన ఆయన్ను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దళిత బంధు రాని వారంతా దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. అయితే రెండో విడత దళిత బంధు ఇవ్వాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే ధర్నా, రాస్తారోకోకు పిలుపునిచ్చారు. ఈ మేరకు పెద్దఎత్తున దరఖాస్తుదారులతో కలిసి హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్దకు ఎమ్మెల్యే చేరుకున్నారు. వారితోపాటు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అందరూ కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. అయితే వారిని అడ్డుకునేందుకు హుజురాబాద్, జమ్మికుంట సీఐలు, ఎస్ఐలు తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిని నిలువరించే ప్రయత్నం చేశారు.

ఈ సందర్భంగా పోలీసులు, నిరసనకారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పరిస్థితిని అదుపు చేసేందుకు



దళిత బంధు లబ్ధిదారులతోపాటు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు వ్యాన్‌లో ఎక్కించే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో వారి మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. దీంతో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పోలీసులు అతన్ని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే ఆందోళనకారులను వ్యానులో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. అయితే మహిళా పోలీసులు లేకపోవడంతో మహిళా ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసేందుకు వెనకడుగు వేశారు. అనంతరం మహిళా కానిస్టేబుళ్లను పిలిపించి రోడ్డుపై భైఠాయించిన వారిని అదుపులోకి తీసుకున్నారు. నిరసన నేపథ్యంలో వరంగల్–కరీంనగర్ జాతీయ రహదారిపై దాదాపు గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి.

# 26 రోజుల పాటు ప్రజా విజయోత్సవాలు

-మొదటిపేజీ తరువాయి

ఈ విషయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం? ఉప ముఖ్యమంత్రి భట్టి అధ్యక్షతన సచివాలయంలో సమావేశమై.. ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.నిరంకుశ ప్రభుత్వాన్ని గద్దె దింపి? రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్న మల్లు భట్టి విక్రమార్క.. ఏడాది పాలనలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. దేశంలోని మరే రాష్ట్రంలో లేని తీరుగా విప్లవాత్మక మర్పులకు శ్రీకారం చుట్టామని, అంచనాలకు మించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. ఈ విషయాల్ని ప్రజలందరి ముందు ఉంచేందుకు.. ఈ వేడుకల్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాలను కలుపుకుని.. 26 రోజుల పాటు ప్రజా విజయోత్సవాలు నిర్వహించనున్నామన్న భట్టి విక్రమార్క, ఈ ఏడాదిలో ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాల రూపకల్పన జరగాలని నిర్దేశించారు. ప్రభుత్వ గ్యారెంటీ పథకాలైన మహిళలకు ఆర్టీసీలో బస్సులో ఉచిత ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్, పేదలకు 200 యూనిట్లలోపు ఉచిత కరెంట్, ఆరోగ్య శ్రీ పరిమితి పెంపు, ఇందిరా మహిళా శక్తి తదితర పథకాలతో



పాటు ప్రభుత్వం అమలుచేస్తున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజల్లోకి తీసుకువెళతామని చెప్పారు.ఇప్పటికే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో 50 వేల ప్రభుత్వ కొలువులు కల్పించామన్న భట్టి, రూ. 18 వేల కోట్ల వ్యవసాయ రుణాల్ని మాఫీ చేసామని, మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందించామని చెప్పారు.భారత ప్రథమ ప్రధాని, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజు నాడు ఈ ఉత్సవాలను ప్రారంభిస్తామన్న భట్టి విక్రమార్క, రాష్ట్రంలో పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలకు రూపకల్పన చేయనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల ముగింపు రోజైన డిసెంబర్ 9 న భాగ్యనగరంలో.. వేలాది మంది కళాకారులతో ప్రదర్శనలు చేస్తామని, ప్రత్యేక లేజర్ షో లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఆ రోజే గ్రూప్– 4 పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేయనున్నట్లు తెలిపారు. అదేరోజు? వివిధ శాఖల పాలసీలను ప్రకటించనున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా.. పరిశ్రమల ఏర్పాటుకు నూతన ఒప్పందాలు కుదుర్చడం, స్పోర్ట్ యూనివర్సిటీకి శంకుస్థాపన కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు భట్టి వివరించారు. 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారా మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క? ఉస్మానియా ఆసుపత్రి.భవన నిర్మాణానికి శంకుస్థాపన సైతం ఉత్సవాల సమయంలోనే ఉండనున్నట్లు వెల్లడించారు. వీటిలో పాటే? రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ప్రారంభం సహా.. శాంత్ర భద్రతల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు తెలిపేలా? వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమాలకు పకడ్బందీ ఏర్పాట్లను చేయాలని సంబంధిత శాఖల కార్యదర్శులను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ భేటీకి.. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సహా.. రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల, ప్రజాకవి జయరాజ్, వివిధ శాఖల కార్యదర్శులు హాజరయ్యారు.

# మళ్లీ జలవివాదం

**నల్గొండ** : తెలుగు రాష్ట్రాల మధ్య మరోసారి జలవివాదం రేగింది. నాగార్జున సాగర్ రైట్ కెనాల్ వాటర్ రీడింగ్ కోసం తెలంగాణ సిబ్బంది డ్యాం వద్దకు వెళ్లగా.. అక్కడి ఆంధ్రప్రదేశ్ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. 'తెలంగాణ వారికి మీకు ఇక్కడేం పని?' అంటూ వారిని అక్కడి నుంచి పంపించేందుకు ప్రయత్నించారు. దీంతో మరోసారి రెండు రాష్ట్రాల మధ్య రచ్చకు అజ్యం పోసింది..మరోసారి ఇరు రాష్ట్రాల మధ్య జల వివాదం మొదలైంది. ప్రతిరోజు తెలంగాణ డ్యాం సిబ్బంది రైట్ కెనాల్ వాటర్ రీడింగ్ ను నోట్ చేసుకుంటారు. యధావిధిగా శనివారం(నవంబర్ 9) రైట్ కెనాల్ వాటర్ రీడింగ్ కోసం వెళ్లిన తెలంగాణ సిబ్బందిని ఆంధ్ర సిబ్బంది ఆదుకోవడంతో మరోసారి ఈ వివాదం కలకలం రేపింది. నాగార్జునసాగర్ డ్యాంపై నీటి మంటలు ఇంకా చల్లారడం లేదు. కొంత కాలంగా తరచు వివాదాలకు కేరాఫ్ గా నాగార్జునసాగర్ డ్యాం మారుతోంది. గత ఏడాది నవంబర్ 28న సాగర్ డ్యాం పై ఎరువు రాష్ట్రాలకు చెందిన పోలీస్ బలగాలు మోహరించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ నేపథ్యంలో కేంద్ర జల సంఘం శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల వద్ద భారీగా బలగాలను మోహరించింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతను తెలంగాణ ప్రభుత్వానికి, శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ ఏపీ ప్రభుత్వాన్ని కేంద్ర జల సంఘం అప్పగించింది. తాజాగా నాగార్జునసాగర్ లో ఈ వివాదం మరోసారి తలెత్తింది.

## కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

**హైదరాబాద్ :** రేవంత్ సర్కార్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే కొనసాగతుంది. ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి పూర్తి కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తారు. ఇప్పటికే మూడు రోజుల పాటు స్టిక్కరింగ్ ప్రాసెస్ పూర్తి చేశారు. సర్వేకు సంబంధించిన వివరాను సైతం ప్రాణాళిక శాఖ వెల్లడించింది. ఇందులో భాగంగా కుల, సామాజిక, విద్య, ఉపాధి తదితర వివరాలను అడిగి నమోదు చేసుకుంటారు. నిజానికి నవంబర్ 6 నుండి సర్వే ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ మొదట స్టిక్కరింగ్ చేశారు.అధికారికంగా నేటి నుండే సర్వే ప్రారంభం కానుంది. సమగ్ర కుటుంబ సర్వే కోసం ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండేవారంతా స్వగ్రామాలకు వెళ్లాలా వద్దా అనే డైలమాలో ఉన్నారు. దీంతో వారు ఉన్నచోటునే వివరాలను వెల్లడించాలని ప్రణాళికశాఖ స్పష్టం చేసింది. ఆధార్ కార్డులో ఉన్న వివరాల ఆధారంగానే సర్వే జరుగుతుందని తెలిపింది. అంతేకాకుండా ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వస్తారని వారు అడిగిన వివరాలు చెబితే సరిపోతుందని చెప్పింది.అయితే కొన్ని ముఖ్యమైన పత్రాలు మాత్రం దగ్గర పెట్టుకోవాలని సర్వే ప్రణాళిక శాక ఇప్పటికే ప్రకటించింది. ముఖ్యంగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్ బుక్, సెల్ ఫోన్ నంబర్ల లాంటివి అందుబాటులో ఉంచాలని సూచించింది. ఎన్యూమరేటర్లు వచ్చే సమయానికి ఇబ్బంది పడకుండా ముందుగానే కాగితాలను సిద్దం చేసుకుంటే వివరాలు కూడా సులభంగా చెప్పొచ్చని స్పష్టం చేసింది. సర్వే పూర్తి కాగానే కుటుంబ సభ్యులు అన్ని వివరాలు సరైనవే అని ఒక సంతకం చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే ఆధారంగా కులాల వారిగా రిజర్వేషన్ల మార్పు, ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకే అందజేత లాంటి కీలక నిర్ణయాలను ప్రభుత్వం తీసుకునే అవకాశం ఉంది.

## బీజేపీని ఓడించండి

-మొదటిపేజీ తరువాయి

భావించారని దుయ్యబట్టారు. దేశ చరిత్రలో మహారాష్ట్రకు ప్రత్యేక స్థానం ఉందని చెబుతూనే, దేశ గతిని మార్చిన ఎందరో మహానుభావులకు ఈ గడ్డ జన్మనిచ్చిందన్నారు. జ్యోతిబాపూలే, బాలగాంగధర్ తిలక్, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి ఎందరో మహానుభావులు ప్రజల్లో చైతన్యం నింపి దేశానికి ఒక దారి



చూపారని వివరించారు. ఇంతటి ఘనతున్న మహారాష్ట్ర ఎవరి చేతుల్లోకి వెళ్లకూడదన్నారు. మహారాష్ట్రకు రావాల్సిన 17 మెగా ప్రాజెక్టులు ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్‌కు తరలించుకుపోయారని ఆరోపించారు.మహారాష్ట్రలో బీజేపీ నేతలు కొద్దిరోజులుగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు సీఎం రేవంత్‌రెడ్డి. మోదీ అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే.. తామే నిజాలు చెబుతూనే ఉంటామన్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ప్రజలకు తెలంగాణలో అమలవుతున్న ఆరు గ్యారంటీలపై నిజాలు చెప్పడానికి ఇక్కడకు వచ్చానని తెలిపారు. తెలంగాణలో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చామన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. అన్నట్లుగానే 25 రోజుల్లో 22 లక్షల 22 వేల 067 మంది రైతులకు రూ.17,869 కోట్ల రూపాయలు మాఫీ చేసి చూపించామన్నారు. ఈ విషయంలో ఎవరికైనా వివరాలు కావాలంటే ఇవ్వడానికి తామే సిద్ధంగా ఉన్నామన్నారు.తెలంగాణ ప్రభుత్వంపై తొలుత ట్వీట్ చేసిన ప్రధాని మోదీ, ఆ తర్వాత దాన్ని తొలగించిన విషయాన్ని గుర్తు చేశారు తెలంగాణ సీఎం. ప్రభుత్వం ఏర్పడిన కేవల 10 నెలల్లో 50వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. ముఖ్యంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని గుర్తు చేశారు.50 లక్షల మంది.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ద్వారా లబ్ది పొందుతున్నారు. వరికి రూ.500 మద్దతు ధర అందించాం. కోటి 4 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వినియోగించు కున్నారు. ఇందుకోసం ఆర్టీసీకి ప్రభుత్వం రూ.3541 కోట్ల రూపాయలను అందజేసిందన్నారు.సామాజిక న్యాయం అందించేందుకు తెలంగాణలో కులగణన సర్వే చేపట్టామని తెలిపారు. వచ్చే ఏడాదిలో జరగనున్న జనగణనలో తెలంగాణ కుల గణనను పరిగణనలోకి తీసుకోవాలని కేబినెట్‌లో తీర్మానం చేశామన్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

## కుల గణనపై మీ వైఖరేంటి!

-మొదటిపేజీ తరువాయి

పూసిందని ఆరోపించారు. లక్ష్మణ్ మీద గౌరవం ఉండేదని, కానీ ఇప్పుడు ఆ గౌరవాన్ని పోగొట్టుకున్నారని అన్నారు. బలహీన వర్గాలను అవమానించే విధంగా లక్ష్మణ్ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు బీజేపీ వ్యతిరేకమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

**బీజేపీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..**

"బీజేపీ నేతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాజస్థాన్‌లో రిజర్వేషన్ అమలు చేస్తుంటే హేమంత్ సొరేన్‌ను అరెస్ట్ చేశారు. వీపీ సింగ్ రిజర్వేషన్లు తెస్తే కమండలం పేరు మీద పదవి నుంచి తప్పించారు. బలహీన వర్గాలకు చెందిన మోదీ బీసీల కోసం పదేళ్లలో ఏమైనా చేశారా చెప్పాలి. తెలంగాణలో బీజేపీ బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి బీసీ అధ్యక్షుడిని తీసేశారు. సివిల్ సొసైటీలో అందరి అభిప్రాయం తీసుకుని కులగణన చేస్తున్నాం. కులగణనకు అడ్డం పడటానికి బీజేపీ చాలా ప్రయత్నాలు చేస్తుంది. ప్రభుత్వం ఏ డాక్యుమెంట్ అడగట్లేదు. సమాచారాన్ని ప్రభుత్వం గోప్యంగా ఉంచుతుంది. బీఆర్ఎస్ సర్వే చేపట్టలేకపోయింది. మేము చేస్తున్నాం సహకరించండి. మూసీ పరివాహక ప్రాంత ప్రజల జీవన విధానం మార్చాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రక్షాళన చేస్తున్నారు. మీరు చేయలేని ప్రక్షాళన మేము చేస్తున్నాం సహకరించాలి.. వీలయితే సపోర్ట్ చేయాలి" అని మంత్రి పొన్నం ప్రబాకర్ అన్నారు.

**చట్టాన్ని చేతుల్లోకి తీసుకోము..**

"మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ అన్నట్లు కులగొట్టిన ప్రాంతాలకు వస్తాం. పదేళు అధికారంలో ఉన్న వారు, వారిచ్చిన గ్యారంటీలు ఏమయ్యాయి. ముందుగా చెప్పాలి. కిషన్ రెడ్డి ఏవిధంగా హైదరాబాద్‌కు ఉపయోగపడుతున్నారో టవర్ సర్కిల్ దగ్గర చర్చకు సిద్ధమా అంటే సప్పుడు చేయలేదు. జైలు కట్టినం కేసీఆర్ కుటుంబం అంతా జైలుకే అని బండి సంజయ్ అన్నారు. కేటీఆర్‌ని పామ్‌హౌస్ కేసులో ఎందుకు అరెస్ట్ చేయట్లేదని బండి సంజయ్ అంటున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని మేము అరెస్ట్ చేయం. కేటీఆర్ , కేసీఆర్, హరీష్ రావులను అరెస్ట్ చేస్తామని మేము అనలేదు. పదేళ్ల అధికారంలో ఉండి ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ పట్టింది మీరు కాదా. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాబోయే పార్లమెంట్ సెషన్‌లో ఢిల్లీకి వెళ్లి కొట్లాడతాం. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉండక పోతే మీరు చరిత్ర హీనులుగా మిగిలిపోతారు" అని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు.

## నూతన విద్యా విధానంపై ఏ.యు లో రెండు రోజుల జాతీయ సదస్సు

ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం ఆధ్వర్యంలో ఈనెల 11 12 తేదీల్లో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు విద్యా విభాగాధిపతి, సదస్సు డైరెక్టర్ డాక్టర్ టి.షారోన్ రాజు తెలిపారు. శనివారం ఉదయం విభాగంలో సదస్సు వివరాలను ఆయన వివరించారు. ఈక్విటీ, డైవర్సిటీ అండ్ ఇంక్లూజన్ ఎన్.ఈ.పీ 2020 ఇష్యూస్, కన్సర్న్స్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై రెండు రోజులు సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సహకారంతో సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్లాటినం జూబ్లీ గెస్ట్ హౌస్ లో 11వ తేదీ సోమవారం నాడు సదస్సును ఏయూ విసి ఆచార్య జి.శశిభూషణరావు ప్రారంభిస్తారని చెప్పారు.


రెండు రోజుల సదస్సులో భాగంగా నూతన విద్యా విధానం 2020 అమలు అనంతరం అంశాలు నిపుణులు చర్చిస్తారు. ప్రధానంగా నాణ్యత కలిగిన టీచర్ల శిక్షణ అవసరాన్ని సూచించడం , గ్రామీణ ప్రాంతాల, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సైతం నూతన విద్యా విధానం అందుబాటులో ఉండే విధంగా చూడటం, వైవిధ్యమైన విద్యార్థుల కోసం అనుకూలమైన నూతన పాఠ్యక్రమం అభివృద్ధి తదితర అంశాలను ఈ సదస్సులో నిపుణులు చర్చిస్తారు.

# సంపాదకీయం

## ఇదేం ప్రజాస్వామ్యం!

“తమది ప్రపంచంలో అత్యంత గొప్ప ప్రజాస్వామ్య దేశంగా తమకు తామే కితాబు ఇచ్చుకుంటూ గొప్పలు చెప్పు కొనే అమెరికాలో, ఇప్పటివరకు ఒక మహిళను అధ్యక్షురాలిగా ఎన్నుకోలేని దుస్థితి. దీనినే మనం “పేరు గొప్ప ఊరుదిబ్బ” అంటాం. మంచి విద్యార్హతలు, విశేషమైన పరిపాలనా అనుభవం. దేశానికి ఉపాధ్యక్షురాలిగా విశేష సేవలు చేసి ప్రశంసలు పొందిన మహిళ కమలా హారిస్ ఓటమి చెందడం ఆశ్చర్యం. దాదాపు అన్ని ప్రీపోల్ సర్వేలు ఆమె ఈ సారి అధ్యక్ష పీఠం ఎక్కడం ఖాయం అంటూ ఊదరగొట్టాయి. ముఖాముఖి వాగ్ధాటిలో కూడా ట్రంప్‌ను కమలా హ్యారిస్ నిలవరించింది. మంచి వక్తగా పలువురి మన్ననలు పొందింది. అయినా ఇలా ఎందుకు జరిగింది? లోపం ఎక్కడుంది? కమలా హారిస్ ఓటమి అనేక ముఖ్యమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. రాజకీయ నాయకత్వంలో లింగ సమానత్వానికి అమెరికాలో చోటు లేదా? అత్యున్నత అధ్యక్ష పదవికి మహిళలు పనికిరారా? గొప్ప ప్రజాస్వామిక దేశంలో రాజకీయ రంగంలో మహిళల ఎదుగుదలకు అడ్డంకులేమిటి? అమెరికాలో మహిళలు 20వ శతాబ్దం ప్రారం భంలో రాజకీయ ప్రాతినిధ్యానికి పోరాటం చేశా రు. 1920లో రాజ్యాంగానికి 19వ సవరణను ఆమోదించడం ద్వారా మహిళలకు ఓటు హక్కు కల్పించబడింది. అయితే, సుమారు శతాబ్దం పాటు రాజకీయ కార్యాలయాలలో మహిళలకు ప్రాతినిధ్యం నామమాత్రంగా ఉంది. 2023 నాటికి, మహిళలకు కాంగ్రెస్ స్థానాలలో కేవలం 28 శాతం మాత్రమే అవకాశం దక్కింది. జనా భాలో (సుమారు 50.5%) మహిళలు ఉన్నా .. పార్టీలలో అధికార పదవులకు మహిళలకు ఇవ్వడానికి అమెరికా సమాజం ముందుకు రాలేదు. పార్టీ నాయకత్వంలో, ప్రభుత్వ పదవుల్లో మహిళలకు గుర్తింపు లేదు. ఇది మహిళల పట్ల అమెరికా వ్యవస్థ చూపుతున్న వివక్ష కాదా! ఇదేం ప్రజా స్వామ్యం. ఇదేమి అగ్రరాజ్య లక్షణం? మొదటి సారి మహిళా అధ్యక్షురాలిగా 1972లో డెమొక్రాటిక్ నామినేషన్ కోసం ఒక మహిళ పోటీ చేసినప్పుడు ఈ చర్చ ముందుకు వచ్చింది. అప్పటి నుండి, హిల్లరీ క్లింటన్, ఎలిజబెత్ వారెన్ వంటి ప్రముఖ వ్యక్తులు అధ్యక్షత్వాన్ని కోరారు. కానీ ఎవరికీ ఈ అధ్యక్ష పీఠం దక్కలేదు. 2016లో క్లింటన్ అభ్యర్థన ఒక మైలురాయిగా చరిత్రలో నిలిచింది. ఆమె ప్రజా ఓటును గెలిచినా, ఎలక్టోరల్ కాలేజీలో ఓడిపోయింది. ఇది కేవలం ఓటరు మద్దతుకు మించి ఉన్న వ్యవస్థాపక సవాల్‌గా అక్కడ ఎన్నికల వ్యవస్థ నిర్మాణం అలా ఉంది. కమలా హారిస్‌తో పోలిస్తే ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవికి సరితూగుతాడా!? నిజానికి కమలా హారిస్ కంటే డొనాల్డ్ ట్రంప్ ఎందులో గొప్ప? ఆయన బడా వ్యాపారవేత్త. కానీ వ్యాపారంలో నిజాయితీ లేదు. అత్యధిక ధనవంతుడు. అయినా ప్రభుత్వానికి ట్యాక్సులు ఎగ్గొడతాడు. ట్రంప్ వ్యక్తిగతంగా నిజాయితీ లేని స్త్రీలోలుడు. అనేక లైంగిక కేసులు తన పైన ఉన్నాయి. అమెరికాలో పలు కోర్టులలో అనేక ఆర్థిక నేరాల్లో నిందితుడు. వ్యాపారంలో మోసపు ఎత్తుగడలు వేయడం ఆయనకు హాబీ. వ్యాపార లెక్కలు అంతా ఫేకే. ట్యాక్సుల ఉల్లంఘన, ఎగవేతలూ మామూలే. తన క్రింద పనిచేసే మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపు కేసులు ఉన్నాయి. లంచాలు ఇచ్చి కేసులు లేకుండా చేసుకోవటంలో దిట్ట. అనేక సార్లు ట్రంప్ ప్రవర్తనపై కోర్టు మొట్టికాయలు వేసింది. ఎన్నికల్లో తన ప్రత్యర్థులను గౌరవించడు. మహిళ అని మొహం కూడా చూడకుండా దూషణలు చేశారు. కమలా హారిస్ రంగును హేళన చేశాడు., ఆమె డ్రస్‌పై కూడా కామెంట్ చేశాడు.. తన ఆకారం అందం చూసుకోడు గానీ ఇతర మహిళలపై బాడీ షేమింగ్ కామెంట్లు చేస్తాడు. ఒకరకంగా మహిళలను గౌరవించని సంస్కార హీనుడు ట్రంప్. అమెరికాలో మహిళల ప్రాతినిధ్యానికి అనేక వ్యవస్థాపక అడ్డంకులు ఉన్నాయి. ఎన్నికల మార్గదర్శకత్వం లేదు. మహిళా పార్టీల నిర్మాణాలు తక్కువ. స్థాపిత రాజకీయ నెట్‌వర్క్‌ల నుండి మద్దతు లభించలేదు. పార్టీలో, ప్రభుత్వంలో మహిళా నాయకుల కొరత కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ప్రచార నిధులు పెద్ద అడ్డంకి. అమెరికా రాజకీయ ప్రచా రాలు ఖరీదైనవి. మహిళలకు తమ పురుష సహచరుల కంటే ఫండింగ్ వనరులు చాలా తక్కువ లభించాయి. అమెరికా పేరుకే అగ్రరాజ్యం. అక్కడ మహిళల లైంగిక వేధింపులు తక్కువ కాదు. వ్యభిచారం, డ్రగ్, గన్ కల్చర్ ఎక్కువ. నల్లవారి పట్ల జాతి వివక్షత ఇప్పటికీ కొనసాగుతోంది. సామాజిక, ఆర్థిక రాజకీయాలలో మహిళలు బాగా వెనుకబడి ఉన్నారు. భారతీయుల ప్రతిభ అంటే గిట్టదు. వారి వివాహ వ్యవస్థ విడాకులు లేకుండా దీర్ఘకాలం దాంపత్య జీవితం గడపగలగడంపై వారికి అసూయ. భారతీయులు తమ సంపాదనను పొదుపుగా వాడటంపై స్థానిక అమెరికా ప్రజలకు ఈర్ష. అందుకే భారతీయ మూలాలు ఉన్న కమలా హారిస్ ఓటమికి అనేక కారణాలలో ఇవి కూడా తోడ్పడ్డాయి. అమెరికాలో ఒక మహిళా అధ్యక్షురాలిగా కమలా హారిస్ ఓడినా...ట్రంప్ గెలిచినా, అమెరికా గొప్పతనం ఇకముందు కూడా వెలిగి పోతుంది అనుకోవడం ఒట్టి భ్రమ మాత్రమే. ట్రంప్ అమెరికాను ఉద్ధరిస్తాడు అనుకోవడం భ్రమే. ఎందు కంటే... ఆర్థికంగా అమెరికా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. అనేక కంపెనీలు, బ్యాంకులు దివాలా తీశాయి. చైనా ఉత్పత్తులతో పోటీపడే పరిస్థితి లేదు. అమెరికా డాలర్ వన్నె తగ్గింది. అనేక మందికి కొవిడ్ తర్వాత ఉద్యోగాలు రోజుకు వేల సంఖ్యలో ఊడుతున్నాయి. డొనాల్డ్ ట్రంప్ నోటి దురుసుతనంతో యూరప్ సంబంధాలు కూడా అంతంత మాత్రమే. ఇతర దేశాలకు అమెరికా పరిశ్రమలు వలస పోతున్నాయి. రష్యా, చైనా, ఇండియా నార్త్ కొరియా, జపాన్ బంధాలు బలపడుతున్నాయి. పాలస్తీనా సమస్య తీరకపోవడానికి అమెరికా ఏకపక్ష స్వార్థ ప్రయోజనాలే కారణం. ట్రంప్ వల్ల నెతన్యాహు యుద్ధంలో మరింతగా రెచ్చిపోనున్నాడు. ట్రంప్ ఇజ్రాయిల్‌కి మొదటి నుండి మద్దతు పలుకుతుంది. యుద్ధం ట్రంప్ వల్ల మరింతగా గల్ఫ్‌కు పాకి ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందా...? రాబోయే కాలమే తీర్పు చెబుతుంది.

# తొలి రాజకీయ సంస్థ స్థాపకుడు సురేంద్రనాథ్ బెనర్జీ



సర్ సురేంద్రనాథ్ బెనర్జీ (1848 నవంబరు 10 – 1925 ఆగస్టు 6) బ్రిటిష్ రాజ్ కాలంలో భారత రాజకీయ నాయకులలో ఒకడు. తొలి భారతీయ రాజకీయ సంస్థలలో ఒకటైన ఇండియన్ నేషనల్ అసోసియేషన్‌ను స్థాపించాడు. దీని ద్వారా ఆనందమోహన్ బోస్ తో కలిసి 1883, 1885 లలో ఇండియన్ నేషనల్ కాన్ఫరెన్స్ రెండు సెషన్లకు నాయకత్వం వహించాడు. బెనర్జీ తరువాత ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడిగా మారారు. కాంగ్రెస్ మాదిరిగా కాకుండా మోంటాగు–చెల్మ్స్‌ఫోర్డ్ సంస్కరణలను స్వాగతించాడు. చాలా మంది ఉదారవాద నాయకులతో అతను కాంగ్రెస్ నుండి నిష్క్రమించి, 1919 లో ఇండియన్ నేషనల్ లిబరేషన్ ఫెడరేషన్ అనే కొత్త సంస్థను స్థాపించాడు. అతను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యులలో ఒకడు. సురేంద్రనాథ్ బెనర్జీ బెంగాల్ ప్రావిన్స్ లోని కలకత్తా (కోల్‌కతా) లో బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. అతని తండి దుర్గా చరణ్ బెనర్జీ వైద్యుడు, ఉదారవాద, ప్రగతిశీల ఆలోచనలు గలవాడు అతని తండ్రి అతనిపై తీవ్ర ప్రభావం చూపాడు. కలకత్తా విశ్వవిద్యాలయం నుండి పట్టా పొందిన తరువాత, అతను 1868 లో రోమేష్ చుందర్ దత్, బిహారీ లాల్ గుప్తాతో కలిసి ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షలను రాయడానికి ఇంగ్లాండ్ వెళ్ళాడు. అతను 1869 లో పోటీ పరీక్షలో నెగ్గినప్పటికీ, అతను తన వయస్సును తప్పుగా చూపించాడనే వాదనతో అతనిని నిషేధించారు. బెనర్జీ 1871 లో మళ్లీ పరీక్షను రాసి విజయం పొంది సిల్‌హెట్‌లో అసిస్టెంట్ మేజిస్ట్రేట్‌గా నియామకం పొందాడు. బెనర్జీ లండన్‌లోని యూనివర్శిటీ కాలేజీలో తరగతులకు కూడా హాజరయ్యాడు. అతను 1871 లో చివరి పరీక్షలు రాసి 1871 ఆగస్టులో భారత దేశానికి తిరిగి వచ్చాడు. 1874 లో, బెనర్జీ లండన్ తిరిగి వచ్చి మిడిల్ టెంపుల్ లో విద్యార్థి అయ్యాడు. బ్రిటీష్ వారి పట్ల విసుగు చెంది భారతదేశానికి తిరిగి వచ్చాడు. అతను ఇంగ్లాండ్‌లో ఉన్న సమయంలో (1874%–%1875), ఎడ్మండ్ బుర్కే, ఇతర ఉదార తత్వవేత్తల రచనలను అధ్యయనం చేశాడు. ఈ రచనలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేసిన నిరసనలలో అతనికి మార్గనిర్దేశం చేశాయి. అతన్ని ఇండియన్ బుర్కే అని పిలిచేవారు. 1882 లో అతను స్థాపించిన రిప్పన్ కాలేజీ (ఇప్పుడు సురేంద్రనాథ్ కాలేజీ)లో ఇంగ్లీష్ ప్రొఫెసర్ అయ్యాడు. అతను జాతీయవాద, ఉదారవాద రాజకీయ అంశాలతో పాటు భారతీయ చరిత్రపై బహిరంగ ప్రసంగాలు చేయడం ప్రారంభించాడు. అతను జూలై 26, 1876 న ఆనందమోహన్ బోస్‌తో కలిసి తొలి భారతీయ రాజకీయ సంస్థలలో ఒకటైన ఇండియన్ నేషనల్ అసోసియేషన్‌ను స్థాపించాడు. 1878 లో భారతీయ ప్రజలను బోధించడానికి జరిగిన సమావేశంలో ఆయన ఇలా అన్నాడు, “హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, పరేసీల మధ్య శాంతి, సద్భావనల గొప్ప సిద్ధాంతం, మన దేశ ప్రగతి అన్ని వర్గాల మధ్య. “ఏకత్వం” అనే పదాన్ని అందులో మెరిసే బంగారం అక్షరాలు చెక్కనివ్వండి... మా మధ్య మత భేదం ఉండవచ్చు, సామాజిక వ్యత్యాసం ఉండవచ్చు. కానీ మనమందరం కలుసుకునే ఒక సాధారణ వేదిక ఉంది. ఇది మన దేశ సంక్షేమం వేదిక “. ఐసిఎస్ పరీక్షలకు హాజరయ్యే భారతీయ విద్యార్థులకు వయోపరిమితి సమస్యను పరిష్కరించడానికి అతను ఈ సంస్థను ఉపయో గించాడు. భారతదేశంలో బ్రిటీష్ అధికారులు దేశవ్యాప్తంగా ప్రసంగాల ద్వారా చేసిన జాతి వివక్షను ఆయన ఖండించాడు. ఇది తనను బాగా ప్రాచుర్యం పొందేట్లు చేసింది. 1879 లో అతను ది బెంగాలీ అనే వార్తాపత్రికను స్థాపించాడు. 1883 లో, తన వార్తా పత్రికలో వ్యాఖ్యలను ప్రచురించినందుకు బెనర్జీని అరెస్టు చేసినప్పుడు, కోర్టు ధిక్కారంలో బెంగాల్ అంతటా, ఆగ్రా, ఫైజాబాద్, అమృత్‌సర్, లాహోర్, పూణే లలో హర్తాళ్ళు, నిరసనలు చెలరేగాయి. భారత జాతీయ కాంగ్రెస్ గణనీయంగా విస్తరించింది. కలకత్తాలో జరిగిన వార్షిక సమావేశానికి భారత దేశం నలుమూలల నుండి వందలాది మంది ప్రతినిధులు వచ్చారు. 1885 లో బొంబాయిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ స్థాపించిన తరువాత, బెనర్జీ 1886 లో వారి సాధారణ లక్ష్యాలు, సభ్యత్వాల కారణంగా తన సంస్థను అందులో విలీనం చేశాడు. 1895 లో పూనాలో, 1902 లో అహ్మదా బాద్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 1905 లో బెంగాల్ ప్రావిన్స్ విభజనను నిరసించిన ప్రజా నాయకులలో సురేంద్రనాథ్ ఒకడు. బెనర్జీ ఈ ఉద్యమంలో ముందంజలో ఉన్నాడు. బెంగాల్, భారతదేశం అంతటా నిరసనలు జరిగి, విస్తృతమైన ప్రజా మద్దతును పొందాడు. ఇది చివరికి 1912 లో బెంగాల్ విభజనను తిప్పికొట్టడానికి బ్రిటిష్ వారిని బలవంతం చేసింది. భారత నాయకులైన గోపాల్ కృష్ణ గోఖలే, సరోజిని నాయుడులకు బెనర్జీ పోషకునిగా మారారు. మితవాద కాంగ్రెస్ సీనియర్ – మోస్ట్ నాయకులలో బెనర్జీ కూడా ఒకడు. విప్లవం, రాజకీయ స్వాతంత్ర్యాన్ని సమర్థించిన వారు బాల గంగాధర్ తిలక్ నేతృత్వంలో 1906 లో పార్టీని వీడారు. స్వదేశీ ఉద్యమంలో బెనర్జీ ఒక ముఖ్యమైన వ్యక్తిగా విదేశీ ఉత్పత్తులకు వ్యతిరేకంగా భారత దేశంలో తయారైన వస్తువులను సమర్థించాడు.

1909 లో మోర్లే–మింటో సంస్కరణలకు బెనర్జీ మద్దతు ఇచ్చాడు. మహాత్మా గాంధీ ప్రతిపాదించిన శాసనోల్లంఘన ఉద్యమం ప్రతిపాదిత పద్ధతిని బెనర్జీ విమర్శించాడు. మాంటెగ్ చెమ్స్ ఫర్డ్ సంస్కరణలను అంగీకరించడానికి సురేంద్రనాథ్ బెనర్జీ అనుకూలంగా ఉన్నాడు. కొందరు కాంగ్రెస్‌ను విడిచిపెట్టి ఇండియన్ లిబరేషన్ ఫెడరేషన్‌ను స్థాపించారు. వారిని ఉదారవాదులు అని పిలుస్తారు. ఆ తరువాత వారు భారత జాతీయ ఉద్యమంలో తమ సాంగత్యాన్ని కోల్పోయారు. బెంగాల్ ప్రభుత్వంలో మంత్రి పదవిని అంగీకరించడం అతనికి జాతీయ వాదుల, ప్రజలకు కోపాన్ని కలిగించింది. అతను 1921 లో సంస్కరించ బడిన శాసన మండలికి ఎన్నుకోబడ్డాడు. అదే సంవత్సరంలో నైట్ , 1921 నుండి 1924 వరకు స్థానిక స్వపరిపాలన మంత్రిగా పదవిలో ఉన్నాడు. 1923 లో ఎన్నికలలో అతని ఓటమి అతని రాజకీయ జీవితాన్ని ముగించింది. కాగా 1923 లో బెంగాల్ శాసనసభ ఎన్నికలలో స్వరాజ్య పార్టీ అభ్యర్థి బిధన్ చంద్ర రాయ్ చేతిలో ఓడిపోయాడు. బ్రిటీష్ సామ్రాజ్యానికి రాజకీయ మద్దతు ఇచ్చినందుకు అతను నైట్ అయ్యాడు. బెనర్జీ బెంగాల్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేస్తున్నప్పుడు కలకత్తా మునిసిపల్ కార్పొరేషన్‌ను మరింత ప్రజాస్వామ్య సంస్థగా మార్చాడు. ఆయన 1925 లో ప్రచురించబడిన ఎ నేషన్ ఇన్ మేకింగ్ ద్వారా విస్తృతంగా ప్రశంసలు అందుకున్నాడు. సురేంద్రనాథ్ 6 ఆగస్టు 1925 న బరాక్‌పూర్‌లో మరణించాడు. భారత రాజకీయాల అధికారీ కరణకు మొదటిగా బాట వేసిన నేతగా – భారత రాజకీ యాల మార్గదర్శకునిగా బాగా గుర్తుంచుకో బడుతున్నాడు. బ్రిటీషువారు ఆయన చివరి సంవత్సరాలలో “సరెండర్ నాట్” బెనర్జీగా గౌరవించారు.

# వైజ్ఞానిక శాస్త్రంతో ఉజ్వల భవిత




నాటి పాత రాతి యుగం నుంచి నేటి డిజిటల్–ఏఐ యుగం వరకు మానవాళి జీవనశైలిలో ఎనలేని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అంతర్జాలంతో భూమి కుగ్రామం అయిపోయింది. అరచేతిలో స్మార్ట్‌ఫోన్ వైకుంఠం వెలిసింది. దేశాల సరిహద్దులు వెలవెలబోతున్నాయి. వేల కిమీ దూరాలు క్షణాల్లో ఆడియోవీడియో కాల్స్ ద్వారా దగ్గరవుతున్నాయి. వ్యవసాయం, విద్య, వైద్యం, సమాచార వితరణ లాంటి అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకనాడు ఊహకందని ఇలాంటి అద్భుత నవ్య జీవన విధానాలు వైజ్ఞానిక సాంకేతిక శాస్త్రాల వల్లనే సుసాధ్యం అవుతున్నది. నేటి ఆవిష్కరణ రేపు పాతబడి పోతున్నది. సైన్స్ లేదా వైజ్ఞానిక శాస్త్రం పరిష్కరించని సమస్యలు ఉండడం లేదు. వైజ్ఞానిక శాస్త్ర మాద్యమంగా సాంకేతిక ప్రగతి కొత్త పుంతలు తొక్కుతున్నది. మానవాళి అన్ని సమస్యలకు సరైన పరిష్కారాలు దొరుకుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పౌర సమాజ సుస్థిరాభివృద్ధి, శాంతియుత సహజీవనానికి వైజ్ఞానిక శాస్త్రం విప్లవాత్మక భూమికను నిర్వహిస్తున్నది. ఇలాంటి విషయాలన్నింటినీ గమనిస్తున్న యునెస్కో 2002 నుంచి ప్రతి ఏట 10 నవంబర్ రోజున “శాంతి, అభివృద్ధికి ప్రపంచ వైజ్ఞానిక దినం (వరల్డ్ సైన్స్ డే ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్)”ను పాటిస్తున్నది. “సుస్థిరాభివృద్ధికి అంతర్జాతీయ వైద్యానికశాస్త్ర దశాబ్దం 2024–33 (ఇంటర్నేషనల్ డికేడ్ ఆఫ్ సైన్స్ ఫర్ సస్టేనబుల్ డెవలప్‌మెంట్ 2024–33)” సమన్వయంతో శాంతి, అభివృద్ధికి ప్రపంచ వైజ్ఞానిక దినం వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా యువత, వైజ్ఞానికేతర సమూహాలను ఏకం చేస్తూ డిజిటల్ ప్రపంచపు సైన్స్ పాత్రను వివరించుట జరుగుతుంది. శాంతి, అభివృద్ధికి ప్రపంచ వైజ్ఞానిక దినం–2024 థీమ్‌గా “వైజ్ఞానిక శాస్త్రం ఎందుకు ముఖ్యం – మనసు నిమగ్నంతో శక్తివంతమైన భవిష్యత్తు (వై సైన్స్ మ్యాటర్స్ – ఎంగేజింగ్ మైండ్స్ అండ్ ఎంపవరింగ్ ఫ్యూచర్)” అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం కొనసాగుతున్నది. సుస్థిర సమాజ స్థాపనలో సైన్స్‌తో పాటు సైంటిస్టుల భూమికను కూడా సామాన్య జనాలకు అవగాహన కల్పించడం, సైన్స్ అందిస్తున్న అద్భుత ఫలితాలతో మానవజాతి శాంతియుతంగా, సమగ్రాభివృద్ధి దిశగా దినదినం వడివడిగా అడుగులు వేస్తున్నది. మన జీవితాల్లో ఆర్థిక, సామాజిక, పర్యావరణ మార్పులకు పునాదిగా సైన్స్ ఆవిష్కరణలు నిలుస్తున్నాయి. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ప్రధాన భూమికను వైజ్ఞానిక శాస్త్రమే నిర్వహిస్తూ, మన ఉజ్వల శాంతియుత భవితకు ఊతం ఇస్తున్నది. శాంతి, అభివృద్ధికి ప్రపంచ సైన్స్ దినం వేదికగా ప్రజల్లో సైన్స్ పట్ల అవగాహన కల్పించడం, ప్రపంచ మానవాళిని ఏకం చేయడం, ప్రపంచ శాంతికి ఆజ్యం పోయడం, సమాజోన్నతికి సైన్స్‌ను వినియోగించడం, శాస్త్ర పరిశోధనలను కొనసాగించాల్సిన అవసరాన్ని చర్చించడం, సైన్స్ అందిస్తున్న ఫలాలతో మన దైనందిన జీవితాల్లో వచ్చిన మార్పులను వివరించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలి. వైజ్ఞానికశాస్త్ర కత్తికి రెండు వైపుల పదును ఉంటుందని గమనిస్తూ సైన్స్ అండ్ టెక్నాలజీ దుర్వినియోగాల నష్టాలను క్షుణ్ణంగా వివరించడం కూడా జరగాలి. స్థానిక స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు సైన్స్ ఆవిష్కరణలతో వచ్చిన టెక్నాలజీలను వ్యక్తులు, సంస్థలు, విద్యాలయాలు వివరించడం నిరంతరం కొనసాగాలి. తమలో ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకునే సందర్భంగా ఈ వేదికలను వినియోగించుకోవడం, సైన్స్ అండ్ టెక్నాలజీలను మానవాభివృద్ధికి, సమాళ్లను అధిగమించే దిశగా సమర్థవంతంగా వాడుకోవడం, సైంటిస్టులను గౌరవించడం, సైన్స్ అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేయడం మన కనీస బాధ్యతగా తీసుకోవాలి.

# బహుముఖ ప్రజ్ఞాశాలి జీడిగుంట

ప్రముఖ సినీ రచయిత, ప్రయోక్త, సాహితీవేత్త, కథలు, నాటకాలు, నాటికలు, నవలలు, సినిమా మాటల రచయిత జీడిగుంట రామచంద్ర హైదరాబాద్ రేడియో కేంద్రంలో 28 ఏళ్ల పాటు పనిచేసి పదవీ విరమణ చేశారు. హైదరాబాదు, ఆకాశ వాణిలో ప్రసారమైన ‘కార్మికుల కార్యక్రమం’లో ఆయన బాలయ్యగా సుపరిచితులు. అందులోని చిన్నక్క, ఏకాంబరం, బాలయ్య పాత్రలు అప్పట్లో ఎంతో పాప్యులర్ అయ్యాయి. జీడి గుంట రామచంద్ర మూర్తి ప్రముఖ సాహితీవేత్త. రేడియో నాటకాలు రాయడం, వాటిల్లో నటించడంబీ కథలు, నాటికలు, నవలలు, సినిమాలకు సంభాషణలు, అనువాద వ్యాసాల రచన... ఇలా అన్నింట్లో తన కలానికున్న సత్తా చాటారు. 1940లో ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో జన్మించిన జీడిగుంట రామచంద్ర మూర్తి విద్యాభ్యాసం అనంతరం వరంగల్ సహకార బ్యాంకులో కొంతకాలం ఉద్యోగంచేశారు. ఆ తర్వాత కొన్నాళ్లపాటు విద్యాశాఖలో కూడా పనిచేశారు. 1971లో ఆకాశ వాణిలో ప్రయోక్తగా చేరి.. పూర్తిస్థాయి రేడియో కళాకారుడిగా కొనసాగారు. హంసగమన.. ఆయన రాసిన తొలి కథ. ఆ తర్వాత 400 కథలు, 40 నాటకాలు, 8 నవలలు రాశారు రేడియో, టెలివిజన్, సినిమాల ద్వారా ఆయన రచనలు ప్రాచుర్యం పొందాయి. ఆయన ప్రముఖ తెలుగు రచయిత. ఆయన ఆలిండియా రేడియో, హైదరాబాదు కేంద్రంలో 28 సంవత్సరాల పాటు తన సేవలనందించారు. కేవలం రచనపై ఉన్న ఆసక్తితోనే ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో ప్రభుత్వ ఉద్యోగం వదులుకుని ఆకాశ వాణిలో అడుగుపెట్టి పదవీ విరమణ వరకు అందులోనే ఉండి పోయారాయన.. ఆయన “కుటుంబ నియంత్రణ” విభాగంలో స్క్రిప్ట్ రచయితగా, తర్వాత “నాటక విభాగం”లో కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేశారు. అప్పుడే దాదాపు 40 నాటికల్ని, నాటకాల్ని రాసి ప్రసారం చేశారు. అలాగే ప్రయోక్తగా మల్లాది వెంకట కృష్ణమూర్తి (మందాకిని), ముదిగొండ శివప్రసాద్ (అనుభవ మంటపం), వాసిరెడ్డి సీతాదేవి (ఉరితాడు), యండమూరి వీరేంద్రనాథ్ (నిశ్శబ్దం నీకూ నాకూ మధ్య) లాంటి ప్రముఖ రచయితల నవలలను రేడియో నాటకాలుగా ప్రసారం చేశారాయన. రేడియోలో ఆదివారాల్లో వచ్చే “కార్మికుల కార్యక్రమం”లో “బాలయ్య”గా ఆయన పాత్ర పోషించారు. చిన్నక్క, ఏకాంబరం పాత్రలతో పాటు బాలయ్యగా శ్రోతలు ఆయనను ఆదరించారు. సుమారు నాలుగేళ్లు ఈ కార్మికుల కార్యక్రమాన్ని నిర్వహించి రికార్డు సృష్టించారు. ఆయన ప్రముఖ నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు నిర్మించిన అమెరికా అబ్బాయి సినిమాకు కథ రాసారు. దుక్కి పాటికి రేడియో వాళ్లంటే ఎంతో అభిమానం. ఆ చిత్రానికి ప్రముఖ రేడియో ఆర్టిస్ట్ ఎర్రమనేని చంద్ర మౌళి మాటలు రాశారు. తర్వాత ఈ ప్రశ్నకు బదులేది, పెళ్లిళ్లోయ్ పెళ్లిళ్లు అనే సినిమాలకు సంభాషణలు రాశారు. మరో మాయాబజార్, అమృత కలశం చిత్రాలకు సహ రచయితగా వ్యవహరించారు. టెలివిజన్ లో బాగా ప్రేక్షకాదరణ పొందిన ‘మనోయజ్ఞం’ సీరియల్‌కు 40 ఎపిసోడ్లకు స్క్రిప్ట్ రాశారు. నిన్నటి కొడుకు కథలు, అశ్రు ఘోష (నాటకం)– 2004 తెలుగు విశ్వ విద్యాలయ సాహితీ అవార్డు లభించింది. ప్రేమకు మిగిలింది, గోదానం, అమూల్యం, నిన్నటి కొడుకు, అమ్మకో ముద్దు, కథలు, వెండితెర సాక్షిగా, గుడిలో పువ్వు ఆయన ప్రముఖ రచనలు. ఆయనకు ముగ్గురు కొడుకులు. ఇద్దరు కొడుకులు అమెరికాలో ఉంటారు.

# రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ సర్కార్

**- ప్రభుత్వంపై మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు మండిపాటు**

**కొల్చారం,నవంబర్09(సూర్య రేఖ)** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని, రైతుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తుందని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు మండిపడ్డారు. శనివారం కొల్చారం మండల కేంద్రం కొల్చారంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన రైతు దీక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో 6 గ్యారంటీలు,16 హామీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ పై వాగ్దానం చేశారని, ఇప్పటివరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా 2 హామీలు పూర్తిగా నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు.రైతు రుణమాఫీ విషయంలో రేవంత్ సర్కారు వాయిదాల మీద వాయిదాలు వేస్తున్నారన్నారు. ఏ జిల్లాకు వెళితే ఆ జిల్లాలోని దేవుళ్ల పై ఒట్లు వేస్తూ దేవుడిని సైతం మోసం చేసిన ఘనుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రతి పంటకు రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.15 వేలు రైతు భరోసా నిధులు చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ వర్షాకాలం పంటలు చేతికొచ్చినప్పటికీ యాసంగి సీజన్ ప్రారంభమైన రైతు భరోసా ఊసేత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల 15 రోజుల క్రితం వరి పంట కోతలు ప్రారంభమైనప్పటికీ ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయడం లేదన్నారు. రైతులు కొనుగోలు ప్రారంభించాలని రోడ్లెక్కుతుంటే రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రి గాలి మోటార్లలో ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు తిరుగుతున్నారన్నారు. కొల్చారంలో జరిగిన రైతు దీక్షను చూస్తే మళ్ళీ ఉద్యమ రోజులు గుర్తుకొస్తున్నాయన్నారు. మొద్దు నిద్రపోతున్న కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలయ్యేలా చేసేందుకు రైతు దీక్షలు అన్ని జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో త్వరలో చేపట్టనున్నట్లు హరీష్ రావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అసమర్ధ పాలనను కప్పిపుచ్చుకోవడానికి మైక్ ముందుకు రాగానే తిట్ల పురాణం అందుకుంటున్నారని హరీష్ రావు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సీఎం కాగా ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి బూతుల సీఎంగా గుర్తింపు పొందాడన్నారు. గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్తు, ప్రతి పంటకు ఎకరాకు రూ.5 వేల రైతుబంధు డబ్బులు, ప్రమాదవశాత్తు చనిపోయిన రైతు కుటుంబాలకు ఐదు లక్షలు రైతు బీమా చెల్లించేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం చేపట్టిన ఒక్కో పథకాన్ని నిలిపివేసిందన్నారు. కాన్పు జరిగితే ఆడపిల్లలకు రూ.15 వేలు, మగపిల్లలకు రూ .12 వేలు ఇవ్వడంతో పాటు కేసీఆర్ కిట్లు ఇచ్చేదని, ప్రస్తుత ప్రభుత్వం అవన్నీ నిలిపివేసిందన్నారు. గత ప్రభుత్వం మిషన్కాకతీయ ద్వారా ఎన్నో ఏళ్లుగా మరమ్మత్తులో కోసుకొని చెరువులు కుంటలు మరమ్మత్తులు చేసిందన్నారు. ఎన్నికల ప్రచారం కోసం మహారాష్ట్రకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు 16 హామీలు పూర్తిస్థాయిలో అమలు చేసినట్లు ప్రచారం నిర్వహిస్తున్నాడని, ఇది ఎంతవరకు నిజమని రైతులను ప్రశ్నించారు. రెండు లక్షల రుణమాఫీ జరిగిందా 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చారా నాలుగువేల పెన్షన్ ఇచ్చారా, అంటూ రైతులను మాజీమంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. ఏడుపాయల అమ్మవారి మీద ఒట్టు పెట్టి, మెదక్ చర్చి మీద ఒట్టు పెట్టి రైతులని కాదు దేవుళ్లను సైతం మోసం చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచాడన్నారు.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గ్యారెంటీకి బాండ్ పేపర్ కు విలువ లేకుండా పోయిందన్నారు.బీఆర్ఎస్ పోరాటాల ఫలితంగానే సగం మంది రైతులకు అయినా రుణమాఫీ జరిగిందన్నారు.రుణమాఫీ విషయంలో రేవంత్ సర్కార్ వాయిదాల మీద వాయిదాలు ఇస్తూ వాయిదాల సర్కారుకు గుర్తింపు వచ్చిందన్నారు.66 ఏళ్ల కాంగ్రెస్ టీడీపీ పాలనకు నిదర్శనమే మూసీ కాలుష్యమన్నారు.మూసీ కాలుష్యం



ప్రక్షాళన పేరుతో వేల కోట్ల కుంభకోణానికి రేవంత్ సర్కార్ తెర లేపారన్నారు.తల విడిచి తోక పట్టినట్లు మూసీ పరివాహక ప్రాంతంలో ఇల్లు కూల్చిన ప్రదేశంలో కాకుండా నల్గొండ జిల్లాలో పాదయాత్ర చేయడం ఏంటని రేవంత్ రెడ్డిని హరీష్ రావు ప్రశ్నించారు. దమ్ముంటే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పాదయాత్రలో పాల్గొనాలని సవాల్ విసిరారు. రానున్న రోజుల్లో రాజకీయ నాయకుల మాటలకు కూడా సెన్సార్ పెట్టాల్సిన పరిస్థితి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల ఏర్పడే అవకాశం ఉందన్నారు. శివంపేట మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, వరి కంకులతో చేసిన మాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలోసంగారెడ్డి జహీరాబాద్ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్,కొనింటి మాణిక్ రావు,మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్ రెడ్డి,క్రాంతి కిరణ్, ఎమ్మెల్సీలు శేరిసుభాష్ రెడ్డి,యాదవ రెడ్డి,దేశపతి శ్రీనివాస్, ఎస్సీ,ఎస్టీ కమిషన్,మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్,డీసీఎంఎస్ ఉపాధ్యక్షులు అరిగే రమేష్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, దేవేందర్ రెడ్డి,ప్రతాపరెడ్డి,నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్,కొల్చారం మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, మేఘమాల సంతోష్,మాజీ ఎంపీపీ మంజుల కాశీనాథ్, డీసీఎంఎస్,మాజీ ఉపాధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు గౌరీ శంకర్,యువజన విభాగం అధ్యక్షులు సంతోష్ రావు,సీనియర్ నాయకులు యాద గౌడ్, యాదయ్య, కిష్టయ్య,ప్రవీణ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లారెడ్డికి మరిన్ని చిక్కులు

**హైదరాబాద్ :** పీజీ మెడికల్ సీట్లలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి మరో సమస్య ఎదురైంది. మల్లారెడ్డి యూనివర్సిటీ స్థలంలోని ఐదెకరాలు తమకు చెందినవంటూ బాధితులు తెరపైకి వచ్చారు. స్థలాన్ని కొలిచేందుకు సర్వేయర్లు, అడ్వకేట్‌తో వచ్చిన బాధితులను స్థానికులు అడ్డుకున్నారు. ఇరు వర్గాల వారికి కోర్టు ఆదేశాలు ఇస్తేనే స్థలాన్ని కొలవనిస్తామంటూ స్థానికులు తేల్చి చెప్పారు.దీంతో కొద్దిసేపు ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. బహదూర్ పల్లికి చెందిన పిట్ల వీరయ్య అనే వ్యక్తికి 641, 642, 643, 644 సర్వే నెంబర్‌లలో ఏడెకరాల తొమ్మిది గుంటల స్థలం ఉండేదని బాధితులు తెలిపారు. పిట్ల వీరయ్యకు ఇద్దరు భార్యలు.. మొదటి భార్యకు ఇద్దరు కొడుకులు, రెండో భార్యకు ఓ కొడుకు ఉన్నారని చెప్పారు. ఏడెకరాల తొమ్మిది గుంటల స్థలాన్ని ముగ్గురు కొడుకులు సమానంగా పంచుకోవాలని వీలునామా సైతం రాసుకున్నారని.. అయితే 1970లో 641 సర్వే నెంబర్‌లోని



రెండెకరాలను మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డికి పిట్ల వీరయ్య మొదటి భార్య కొడుకులు పిట్ల చంద్రయ్య, పిట్ల నరసింహులు అమ్మేసినట్టు వివరించారు.అయితే 642, 643, 644 సర్వే నెంబర్‌లలో ఉన్న మిగతా ఐదెకరాలను కూడా మల్లారెడ్డి కబ్జా చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.ఈ విషయంపై కోర్టులో పిటిషన్ వేశామని, సర్వే చేయించుకొని ఎవరి స్థలాన్ని వారు తీసుకోవాలని కోర్టు ఉత్తర్వులు సైతం ఇచ్చిందని బాధితుడు పిట్ల యాదగిరి తరపు అడ్వకేట్ రమణ తెలిపారు.ఇరు వర్గాల వారికి కోర్టు ఆర్డర్స్ ఇస్తేనే సర్వే చేసేందుకు అనుమతి ఇస్తామంటూ స్థానికులు బాధితులను అడ్డుకున్నారు. ఒక వర్గానికే కోర్టు ఆర్డర్స్ ఇవ్వడం వల్లే సర్వేను అడ్డుకుంటున్నామని పేర్కొన్నారు.దీంతో కోర్టు ఆర్డర్‌తోనే మళ్లీ వచ్చి సర్వే చేస్తామని బాధితులు స్పష్టం చేశారు.మొత్తంగా ఓ పక్క ఈడీ నోటీసులు.. మరోపక్క మల్లారెడ్డి యూనివర్సిటీలో తమకు ఐదెకరాల స్థలం ఉందంటూ బాధితులు ఆందోళనకు దిగడంతో మాజీమంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

# అఖిలభారత దళిత హక్కుల ఉద్యమం రెండవ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

**హిమాయత్ నగర్ :** దేశవ్యాప్తంగా దళిత సామాజిక న్యాయం కోసం విద్యా వైద్య వ్యాపారాన్ని రద్దు చేయాలని ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం దేశ సంపదలో దళితుల వాటా కోసం సమర శంఖారావం పూరించడానికి 2025 జనవరి 5 6 7 తేదీలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్ హైదరాబాద్ నగరంలో జరిగే అఖిలభారత దళిత హక్కుల ఉద్యమం రెండవ జాతీయ మహాసభలు విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ బాల నరసింహా గారు పిలుపునిచ్చారు. శనివారం రోజున నారాయణగూడలోని సత్యనారాయణ రెడ్డి భవన్ లో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం గారి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సమితి సమావేశానికి ముఖ్య అతిథులుగా బాలు నరసింహ గారు హాజరై మాట్లాడుతూ ప్రభుత్వాలు దళితుల అభివృద్ధి పైన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని నేటికీ దళితులకు పరిమితంగానే విద్యా ఉద్యోగ అవకాశాలు దొరుకుతున్నాయని కొంతమేరకు ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా దళితులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు దొరికెవి కానీ బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారం లోకి వచ్చాక ప్రైవేటీకరణ సరళీకరణ ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేయడం మూలంగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా దళితుల అభివృద్ధికి అడ్డంకిగా




మారుతుందన్నారు కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిలిపివేసి ప్రైవేట్ రంగాలలో రిజర్వేషన్లు అమలకు పార్లమెంట్లో బిల్లులు ప్రవేశపెట్టాలని ఎప్పుడైతే ప్రభుత్వ ఉద్యోగాలు లేవు రిజర్వేషన్లు అమలు చేయబడవు ఫలితంగా ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్య ధోరణిగా వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. నాయకత్వంలో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ సేవలు ఉన్నత విద్యలో ప్రైవేటీకరణ వేగవంతం కావడానికి తోడు ప్రైవేట్ రంగాలలో రిజర్వేషన్ లేకపోవడం వలన ఉపాధి ఉద్యోగ అవకాశాలు దళితులకు వాటా దక్కడం లేదని రిజర్వేషన్ల విషయంలో రాజ్యాంగ ఆదేశాలు ఉల్లంఘిస్తున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాప్తంగా దళితులకు ఆర్థిక రాజకీయ సామాజిక హక్కుల పరిరక్షణ సామాజిక న్యాయం కొరకు కుల వివక్షత కుల నిర్మూలన కొరకు ఎస్సీ సబ్ ప్లాన్ దేశవ్యాప్తంగా అమలు చేయాలని దళితుల అభివృద్ధికి కేటాయించిన నిధులు దారి మళ్లించకుండా స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహించుటకు భవిష్యత్తు కార్యాచరను రూపొందించుకొని దేశవ్యాప్తంగా నిర్మాణ ప్రతిష్టతను పెంపొందించుకోవడానికి 2025 జనవరి 5 6 7 తేదీలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్ ఖైరతాబాద్ హైదరాబాదులో అఖిలభారత దళిత హక్కుల ఉద్యమం ఏఐడీఆర్ఎం రెండవ జాతీయ మహాసభలు నిర్వహించబోతున్నామని ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని ఈ మహాసభ లను తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున నిర్వహించబోతున్నామని కావున డిహెచ్పిఎస్ నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని బాల నరసింహా గారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్,సలింగటి శ్రీనివాస్, ఏ రాజు,వై ఉష, జే కుమార్, కె సహదేవ్,లావణ్య ,బద్రయ్య,ఎర్రల రాజయ్య, మద్దెల దినేష్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్ష తేదీల షెడ్యూల్ విడుదల..

**హైదరాబాద్ :** పదవ తరగతి పరీక్ష ఫీజు తేదీలను తెలంగాణ ప్రాథమిక విద్యామండలి విడుదల చేసింది. ఈ నెల 18 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. 18వ తేదీ వరకు ఎలాంటి అదనపు రుసుము లేకుండా ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 2 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబర్ 12 వరకు అవకాశం కల్పించారు. అంతే కాకుండా రూ.500 రుసుముతో డిసెంబర్ 21వ తేదీ వరకు అవకాశం కల్పించారు. 21వ తేదీనే చివరి తేదీగా ప్రకటించింది. ఆ తరవాత ఫీజు కట్టేందుకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఫీజుల వివరాల విషయానికి వస్తే? రెగ్యులర్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ. 125 చెల్లించాల్సి ఉంటుంది. మూడు అంతకంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.110 చెల్లించాలి. మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఉన్నా కూడా రూ.125 చెల్లించాలి. అంతేకాకుండా ఒకేషనల్ విద్యార్థులు రూ.125తో పాటు అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంటుంది. 2025 మార్చి నెలలో పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఇటీవలే తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫీజు షెడ్యూల్ సైతం విడుదలైంది. నవంబర్ 6వ తేదీ నుండి పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు.అదనపు రుసుము లేకుండా నవంబర్ 26వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంది. ఆ తరవాత చెల్లించేవారు అదనపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరవాత చెల్లించే వారు ఫైన్ తో చెల్లించడానికి అవకాశం ఉంది. ఇక అదనపు రుసుము వివరాలు చూస్తే.. రూ.100 నుండి అదనపు రుసుముతో కట్టేందుకు వీలు ఉండగా చివరి తేదీ డిసెంబర్ 27 వరకు అదనపు రుసుము రూ.2000తో కట్టేందుకు అవకాశం ఉంది. ఆ తరవాత ఫీజు కట్టేందుకు అవకాశమే లేదు. కాబట్టి పదోతరగతి, ఇంటర్ విద్యార్థులు గడువు ముగియకముందే ఫీజు చెల్లించాలి.

## భారీగా డ్రంకెన్ డ్రైవ్ కేసులు

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో డ్రంకెన్ డ్రైవ్ కేసులు పెరుగుతున్నాయి. పలుసార్లు డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారి తీరు మారడం లేదని అడిషనల్ సీపీ (ట్రాఫిక్) విశ్వ ప్రసాద్ తెలిపారు. కొందరు వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారని చెప్పారు.వీకెండ్ రోజుల్లో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత రాత్రి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ ఏర్పాటు చేశామని అన్నారు. జూబ్లీహిల్స్ బంజారాహిల్స్ లోని పబ్బులు, రెస్టారెంట్లు, బార్లలో ఎస్టాబ్లిష్మెంట్ పార్కింగ్ లేకుండా వాలెట్ పార్కింగ్ పేరుతో రోడ్లమీద కస్టమర్ల వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని తెలిపారు.రాంగ్ పార్కింగ్ మీద డ్రైవ్ చేశామని, సుమారుగా 50 నుంచి 100 వాహనాలకు లాక్ వేశామని చెప్పారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సులకు 10 తర్వాతే సిటీలోకి అనుమతి ఉంటుందని అన్నారు. ప్రయాణికులు ఎక్కించుకునేందుకు సిటీలో కొన్ని హోల్టింగ్ పాయింట్స్ పెట్టుకున్నారని, కొన్నిచోట్ల వరుసగా వాహనాలు రావడంతో సిటీలో రాత్రుళ్లు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని తెలిపారు.రానున్న రోజుల్లో బస్సు ట్రావెల్స్ ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు యాజమాన్యాలతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉదయం వేళలో కూడా ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్ చేస్తున్నామని తెలిపారు. విత్అవుట్ హెల్మెట్, రాంగ్ డ్రైవింగ్ మీద ఫోకస్ పెట్టామని చెప్పారు. వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాల్సిందేనని అన్నారు.. నగరంలో రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ అయ్యాయని చెప్పారు. కొందరు మద్యం మత్తులో ప్రమాదాలు చేస్తున్నారని అన్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ లో 8 పాయింట్స్ వద్ద స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ లతో పాటు రాంగ్ పార్కింగ్ పై ఫోకస్ పెట్టామని చెప్పారు. కస్టమర్లు కూడా హోటల్స్ కు వచ్చేముందు సరైన పార్కింగ్ ఉందో లేదో చూసుకోవాలని అన్నారు.

## పదవులు శాశ్వతం కాదు...

**పోలీసులు రేవంత్ రెడ్డి కనుసన్నల్లో పని చేస్తున్నారు**

**మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్**



**హైదరాబాద్ :** హుజూరాబాద్ నియోజకవర్గంలో రెండవ విడత దళిత బంధు కోసం దళితులు చేస్తున్న ధర్నాకు మద్దతు తెలిపిన పాడి కౌశిక్ రెడ్డిపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. పోలీస్ యంత్రాంగం రేవంత్ రెడ్డి కనుసన్నల్లో పని చేస్తోంది. పోలీసులు అనవసరంగా దాడి చేస్తే చర్యలు తప్పవు. దళితులపై లాఠీ ఛార్జ్ చేయడాన్ని బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. దళితులకు రావాల్సిన డబ్బులను ప్రభుత్వం ఫ్రీజ్ చేసింది. దళితబంధు పథకానికి హుజురాబాద్ నియోజకవర్గాన్ని కేసీఆర్ పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకున్నారు. దళితబంధు లబ్ధిదారులు ఆహ్వానిస్తేనే పాడి కౌశిక్ రెడ్డి ధర్నాలో పాల్గొన్నారు. లాఠీ ఛార్జ్ లతో పోరాటాన్ని ఆపలేరు. 5000 మందికి కేసీఆర్ ప్రభుత్వం దళిత బంధు డబ్బులను లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేయడం జరిగింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం లబ్ధిదారుల అకౌంట్లను ఫ్రీజ్ చేసింది . ప్రభుత్వం వెంటనే ఫ్రీజ్ చేసిన అకౌంట్ల నుంచి లబ్ధిదారులకు డబ్బులు ఇచ్చే విధంగా బ్యాంకులకు అదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## రేవంత్ భాష, పద్ధతి మార్చుకోవాలి




**హైదరాబాద్ :** ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ,కాలేరు వెంకటేష్ ,బీ ఆర్ ఎస్ నేత స్వామి యాదవ్ శనివారం మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళన పేరుతో బజారు భాష మాట్లాడుతున్నారు. మూసీ నది ప్రక్షాళన స్టార్ట్ చేసింది బిఆర్ఎస్ పార్టీ. బిఆర్ఎస్ అడ్డుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం దురదృష్టకరం. మూసీ నది అభివృద్ధి పేరుతో నిర్వాసితులకు నష్టం జరగొద్దని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. నల్గొండ జిల్లా రైతులను సీఎం రేవంత్ రెడ్డి రెచ్చగొడుతున్నారు. కేటీఆర్ హైదరాబాద్ నగరంలో 32 ఎస్టీపీలను నిర్మించారు. దాదాపు 8 ఎస్టీపీల నిర్మాణం పూర్తి అయింది. మూసీ అభివృద్ధి చైర్మన్ గా నన్ను నియమించి కేసీఆర్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. అర్ధరాత్రి పోలీసులను పంపి ఇళ్లను ఖాళీ చేయాలని ప్రభుత్వం పేదలపై ఒత్తిడి తెస్తోంది. మూసీ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్యాకేజీ అమలు చేయాలి. సీఎం రేవంత్ రెడ్డి భాష, పద్దతి మార్చుకోవాలి. మూసీ నిర్వాసిత ప్రజలకు నష్ట పరిహారం ఇవ్వాలని బుల్డోజర్లకు అడ్డం పడతామని బిఆర్ఎస్ చెప్పింది. పేదలకు నష్టం జరగకుండా బిఆర్ఎస్ ప్రభుత్వం మూసీని అభివృద్ధి చేసిందని అన్నారు. టెండర్లు కాకుండా లక్షా 50 వేల కోట్లు అని సీఎం ఎందుకు చెప్పారు. సినిమా మేము చూపెడతామా. రేవంత్ రెడ్డి చూపెడతాడో చూద్దాం. కాంగ్రెస్ పార్టీకి టచ్ లోకి వెళ్లిన వాళ్ళు మాతో టచ్ లో ఉన్నారు. సీఎం ప్రజలకు రోల్ మోడల్ గా ఉండాలి. రేవంత్ రెడ్డి సంస్కారవంతమైన భాష మాట్లాడాలి. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో ఎన్ని అమలు చేసిందో ప్రజలకు తెలుసు. రుణమాఫీ ఎంతమంది రైతులకు అయిందో తెలుసు. మూసీ నది ఒడ్డుకు ఉన్న వాళ్ళు దినదినగండంతో బతుకుతున్నారు. మూసీలో మురికి నీరు లేకుండా ఉండటం కోసం ఎస్టీపీల నిర్మాణం జరిగింది. నల్గొండ రైతుల కోసమే 3 వేల కోట్లతో ఎస్టీపీల నిర్మాణం చేశామని అన్నారు.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలి






**సర్వే షెడ్యూల్ పై ముందస్తు ప్రచారం చేయాలి..**
**సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన డిప్యూటీ సీఎం.మల్లు భట్టి విక్రమార్క.**

**పెద్దపల్లి,నవంబర్09(సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లాల కలెక్టర్లతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభోత్సవం సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర సిఎస్ శాంతి కుమారితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టు విక్రమార్క మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే నిర్వహణకు హౌస్ లిస్టింగ్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలెక్టర్లు విజయవంతంగా పూర్తి చేసినందుకు అధికార యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. హౌస్ లిస్టింగ్ కార్యక్రమంలో వచ్చిన ఇండ్ల సంఖ్య ఆధారంగా ప్రతి 150 ఇండ్లకు ఒక ఎన్యుమరేటర్,10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్ వైజర్ లను నియమించుకొని సర్వే చేపడుతున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు.15 రోజుల పాటు నిరాటంకంగా సర్వే చేయాలని,ఒక కుటుంబాన్ని కూడా వదలకుండా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు.సర్వే షెడ్యూల్ సంబంధించి ముందస్తుగా గ్రామాలలో వార్డులలో సమాచారం అందించాలని,ఏ సమయంలో సర్వే బృందాలు ఇండ్లకు వస్తాయో విస్తృతంగా ప్రచారం చేయాలని,సర్వే సమయంలో కుటుంబ సభ్యులు ఇంటి వద్ద అందుబాటులో ఉండే విధంగా ముందస్తు సమాచారం అందించాలని డిప్యూటీ సీఎం సూచించారు.సర్వే సమయంలో ఇంటి వద్ద కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు వివరాలు రేషన్ కార్డ్ పట్టా పాస్ పుస్తకాల వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని డిప్యూటీ సీఎం ప్రజలను కోరారు.రాష్ట్రంలోని వివిధ వర్గాల ఆర్థిక సామాజిక స్థితిగతులను తెలుసుకొని వారిని వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు సరైన పథకాల రూపకల్పన కోసం సమాచార సేకరణకు మాత్రమే ఈ సర్వే నిర్వహిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు.సర్వే నిర్వహణ సమయంలో ప్రజలు ఎక్కడైనా ఎందుకు సమాచారం సేకరిస్తున్నారని, అడిగితే అధికారులు వివరించాలని తెలిపారు.ఈ సర్వే కారణంగా ఎటువంటి ప్రభుత్వ పథకాలకు కోత విధించడం ఉండదని తెలియజేయాలని,ప్రజల అపోహలను దూరం చేసి సంపూర్ణ వివరాలు సేకరించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు.హౌస్ లిస్టింగ్ పూర్తయినందున నేటి నుంచి ఇంటింటికి తిరుగుతూ సర్వే ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు.ప్రతి ఎన్యుమరేటర్ చేసిన సర్వేలో కనీసం 10 శాతం మేర ఇండ్లను సూపర్ వైజర్ క్రాస్ చెక్ చేసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు.సర్వే వివరాలను ప్రతిరోజు ఎన్యుమరేటర్ల మండల స్థాయిలో తహసిల్దార్,ఎంపిడిఓ కార్యాలయాల వద్ద అప్పగించాలని తెలిపారు.సర్వే వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అధికారులు విజయవంతంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం కోరారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,రెవెన్యూ డివిజన్ అధికారులు గంగయ్య,సురేష్,జిల్లా పరిషత్ సీఈఓ,కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాశ్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు కళ్ళలో ఆనందమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం






**వడ్లు కటింగ్ లేకుండా కొనుగోలు చేస్తాం..**
**సన్నడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్..**
**యాసంగికి అనురాధ కార్తెలో నార్లు పోయాలి..**
**పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు**

**పెద్దపల్లి,నవంబర్09(సూర్యరేఖ)**రైతుల కళ్ళలో ఆనందమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు.పెద్దపల్లి మండలం అప్పన్నపేట, అందుగులపల్లి, బ్రాహ్మణపల్లి,రాగినేడు,కనగర్థి,కాపులపల్లి,కాసులపల్లి,గోపయ్యపల్లి,పాలితం,బొంపెల్లి,మేరపల్లి,తుర్కల మద్దికుంట గ్రామాల్లో అలాగే పెద్దపల్లి పట్టణంలోని చందపల్లిలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే విజయరమణరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ధాన్యంలో ఎలాంటి కటింగ్ లేకుండా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు.సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని రైతులు భరోసాగా ఉండాలని తెలిపారు.దళారుల చేతిలో మోసపోవద్దని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, వాటిని రైతుకు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని,ప్రతి గింజ సన్న వడ్లకు బోనస్ రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని హామీ ఇచ్చారు.నిబంధనలు మేరకు ధాన్యంలో తేమ శాతం ఉండేలా రైతులు ధాన్యాన్ని ఆరబోయాలని సూచించారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యం ఉంటే వేరువేరుగా ఉంచాలని మిల్లర్లతో మాట్లాడి సపరేటుగా మద్దతు ధరకు కొనుగోలు చేయించే భాధ్యత నాదేనని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.రానున్న యాసంగి సాగుకు అనురాధ కార్తెలో నార్లు పోయాలని, తద్వారా అనుకూల వాతావరణంలో పంట చేతికి వస్తుందని అన్నారు.యాసంగిలో తెగుళ్లను తట్టుకునే వరి రకాలను సాగు చేసుకోవాలని రైతులకు వివరించారు. 1010,64,118 రకాల యాసంగికి అనుకూలమన్నారు.రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని,ప్రజా పాలనలో రైతులకు మేలు చేయడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమాల్లో మార్కెట్ ఛైర్మన్ ఈర్ల స్వరూప, సింగిల్ విండో ఛైర్మన్ చింతపండు సంపత్,మాజీ జడ్పీటిసి బండారి రాంమూర్తి,సందవేణ రాజేందర్, సత్యనారాయణ రెడ్డి,అరే సంతోష్,ఏదల్లి శంకర్,కూర మల్లారెడ్డి, ప్రమేష్, విజయ్, రాజయ్య, నెటట్ల కుమార్,వెంకటేష్,శ్రీనివాస్,ఐకెపి ఏపిఎం సంపత్,సింగిల్ విండో సిఈఓ తిరుపతి,మాజీ సర్పంచులు, ఎంపీటీసిలు,కాంగ్రెస్ నాయకులు,డైరెక్టర్లు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

# మరకత ఆంజనేయ ఆలయంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు

**శంకర్‌పల్లి,నవంబర్ 09(సూర్యరేఖ)** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సింగాపురం పదవ వార్డులో గల మరకత కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి,స్వామి వారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ...పట్టణ,వార్డు ప్రజలు స్వామివారి దీవెనలతో, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఎంపీ కోరుకున్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం,స్థానిక కౌన్సిలర్ లావణ్య శ్రీనివాస్ రెడ్డి,జిల్లా బిజెపి అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రభాకర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు రాములు గౌడ్,మాజీ జెడ్పిటిసి విట్టలయ్య, మున్సిపల్ ఇంచార్జ్ వాసుదేవ్ కన్నా,నాయకులు వెంకట్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు వెంకటేష్,మున్సిపల్ అధ్యక్షులు సురేష్, మాజీ సర్పంచ్ బయన్న,దయాకర్ రెడ్డి, యూత్ అసోసియేషన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ ముమ్మరంగా నిర్వాహణ

**బాధితులు,ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి**
**ముత్తారం పోలీసుస్టేషన్ ఆకస్మిక సందర్శనలో రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్**




**ముత్తారం/పెద్దపల్లి,నవంబర్09(సూర్యరేఖ)** గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ ముమ్మరంగా నిర్వహించేలా చొరవతో పని చేయాలని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ సూచించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల పిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. రామగుండం పోలీసు కమీషనరేట్ పెద్దపల్లి జోన్ ముత్తారం(మంథని) పోలీస్ స్టేషన్ ను రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ కమీషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్ ల విజిట్ లో భాగంగా శనివారం ఆకస్మికంగా సందర్శించారు.పోలీస్ స్టేషన్ చేరుకున్న సీపీ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను సందర్శించి పోలీసు స్టేషన్ సీసీసీ పిటిషన్ లు, వాటి రికార్డ్ లను తనిఖీ చేశారు.మహిళలు,పిల్లలు,సీనియర్ సిటిజన్లతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు.సిబ్బంది పనితీరు, నమోదు చేయబడిన కేసులలో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ప్రజలతో,ఫిర్యాదుదారులతో ఎలా ప్రవర్తిస్తున్నారని తెలుసుకున్నారు.పోలీసు స్టేషన్ రికార్డ్స్ తనిఖీ చేసి పోలీసు స్టేషన్ పరిధి గ్రామ పంచాయతీ లు, ఆమ్లేట్ గ్రామాలు,భౌగోళిక పరిస్థితులు,లా అండ్ ఆర్డర్ ఇష్యూస్,పొలిటికల్ సమస్యలు, గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయనే తదితర అంశాలను ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు.పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలు,వారు చేస్తున్న విధులు,పని తీరు,వారికీ ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.2023 సంవత్సరంకు ముందు నమోదై పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ట్రాఫిక్ సంబంధించిన సమస్యలు,ప్రమాదాలు జరిగే ప్రాంతాలు ఉంటే గుర్తించి నివారణ చర్యలు చేపట్టి సమస్య పరిష్కారం చేయాలని, రోడ్డు ప్రమాద కేసులను కూడా పెండింగ్ లో ఉంచకూడదు అని సూచించారు.పోలీసు స్టేషన్ కు వచ్చే బాధితుల పిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.బ్లూ క్లోట్స్ సిబ్బందితో మాట్లాడి డయల్ 100 కాల్స్ కు స్పందించి,వారు సంఘటన స్థలంకు చేరుకొన్న టైం వివరాలు ట్యాబ్ లో చెక్ చేశారు.బ్లూ క్లోట్స్,ప్యాట్రో కార్ సిబ్బంది ముఖ్యమైన పాయింట్ బుక్స్ లను తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు.బ్లూ క్లోట్స్ సిబ్బంది డయల్ 100 కాల్స్ కు వెంటనే స్పందించి వారు సంఘటన స్థలంకు త్వరగా చేరుకోవాలని సూచించారు.పోలీసు స్టేషన్ పరిధిలో నేను సైతంలో భాగంగా ప్రజల,వ్యాపారస్థుల, ప్రజా ప్రతినిధులు అందరి సమన్వయంతో సీసీ కెమెరాల ఏర్పాటు కు కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు,ఫిర్యాదులు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని, గంజాయి,మత్తు పదార్థాల సరఫరా,విక్రయం,అక్రమ రవాణా,సేవించడం వంటి వాటిపై అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మంథని సీఐ రాజు,ఎస్ఐ గోపతి నరేష్ కుమార్,పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కేంద్రమంత్రులు... అయితే ఏంటీ...

**విజయవాడ :** కేంద్రంలోనూ,రాష్ట్రంలోనూ తెలుగుదేశం పార్టీ అనుకూల ప్రభుత్వాలే ఉన్నాయి.పైగా టిడిపి సహకారం లేనిది కేంద్ర ప్రభుత్వం నడవని పరిస్థితి.ఈ తరుణంలో టిడిపికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులపై చంద్రబాబు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఏపీలో అభివృద్ధి పనులపై దృష్టి సారించింది కూటమి ప్రభుత్వం. ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే..పెద్ద ఎత్తున అభివృద్ధి చేపట్టాలని భావిస్తోంది.అందులో భాగంగా రూ.5407 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఎన్టీఆర్, గుంటూరు, చిత్తూరు, నంద్యాల, శ్రీ సత్య సాయి, శ్రీకాకుళం అనకాపల్లి, కృష్ణ, ప్రకాశం, తిరుపతి, కడప జిల్లాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లనిర్మాణాన్ని ప్రారంభించారు సీఎం చంద్రబాబు.అయితే ఇచ్చాపురంలో జరిగిన కార్యక్రమానికి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హాజరు కాలేదు. దీంతో సీఎం చంద్రబాబు చురకలాంటించారు. గుంటూరు జిల్లా తాళ్లాయపాలెంలో 55 కోట్లతో నిర్మించిన కె.వి గ్యాస్ ఇన్సులేటెడ్ విద్యుత్ సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. అక్కడ నుంచి మిగతా జిల్లాల్లో సబ్ స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన సీఎం చంద్రబాబు ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు.శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురంలో జరిగిన కార్యక్రమానికి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఎందుకు రాలేదని కలెక్టర్ ను ప్రశ్నించారు.కార్యక్రమానికి ఆహ్వానం పంపలేదా అంటూ అడిగేసరికి.. కలెక్టర్ పంపమని చెప్పుకొచ్చారు. దీనిపై మాట్లాడారు చంద్రబాబు. ఎంత బిజీగా ఉన్నా ప్రజలకు దూరం కాకూడదు కదా.. వర్చువల్ గా కూడా జాయిన్ కావచ్చు. మంత్రులైన ఎంపీ లేనన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ప్రజలతో మమేకం కావాలి. దీని నుంచి తప్పించుకోకూడదు అంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును ఉద్దేశించి సీఎం చంద్రబాబు అన్నారు.మరోవైపు తాళ్లాయపాలెంలో సీఎం చంద్రబాబు తో పాటు అదే జిల్లాకు చెందిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. ఆయనను సైతం ఉద్దేశించి చురకలంటించారు చంద్రబాబు. ప్రారంభోత్సవ సమయంలో అక్కడ శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం ఫోటో సెషన్ జరిగింది. అప్పుడు చంద్రబాబు పెమ్మసానిని పిలిచారు. వచ్చి తన పక్క నిలబడాలని చెప్పారు. చంద్రశేఖరు ఇటు రా నువ్వు మంత్రివయ్యా, ఎంపీ వి కూడా.. ప్రోటోకాల్ వల్ల సెంటర్ స్టేట్ ప్రాబ్లం రాకుండా అంటూ వ్యాఖ్యానించారు. అంతటితో ఆగకుండా ఆరు నెలలు అయింది. రాష్ట్రానికి ఇంకా డబ్బులు తీసుకురాలేదంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. మొత్తానికైతే కేంద్ర మంత్రులకు సీఎం చంద్రబాబు నాయుడు చురకలంటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. మొత్తం 25 పార్లమెంట్ స్థానాలకు గాను 21చోట్లకూటమి అభ్యర్థులే ఎంపీలుగా గెలిచారు.కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామిగా మారింది.ఈ తరుణంలో ఎన్డీఏలో చేరిన తెలుగుదేశం పార్టీకి రెండు మంత్రి పదవులు లభించాయి.

## తిరుపతిలో 32 ఎకరాల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

**తిరుపతి :** ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ కాంప్లెక్స్ అందుబాటులోకి రానుంది. ఈ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. 32 ఎకరాల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం దిశగా అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ( శాప్) ఛైర్మన్ అనిమేని రవి నాయుడు, తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గం టీడీపీ అధ్యక్షుడు నర్సింహ యాదవ్‌తో కలిసి తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. సరికొత్త ప్రణాళికలతో రాష్ట్రంలో క్రీడా నైపుణ్యాభివృద్ధి కోసం నూతన క్రీడా పాలసీ తెచ్చినట్లు వివరించారు.ఇటీవలే సీఎం చంద్రబాబు నాయుడు ఆమోదించిన నూతన క్రీడా పాలసీలోని పలు అంశాలపై చర్చించారు. అలాగే తిరుపతి జిల్లాలో ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణంపై ఈ సమావేశంలోనే ప్రతిపాదనలు వచ్చాయి. ఈ కాంప్లెక్స్ నిర్మాణం కోసం అవసరమయ్యే 32 ఎకరాల భూ సేకరణకు సహకారం అందించాల్సిందిగా శాప్ ఛైర్మన్ రవి నాయుడు

# ఫుట్‌పాత్ ల ఆక్రమణలపై జిహెచ్‌ఎంసి అధికారుల కొరడా





**రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమణాలను తొలగించిన అధికారులు**

**రాజేంద్రనగర్,నవంబర్ 09** ఫుట్‌పాత్?ల ఆక్రమణలపై రాజేంద్రనగర్ సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కొరడా ఝుళిపించింది.ఇష్టారాజ్యంగా ఆక్రమించుకున్న దుకాణాలను, డబ్బాలను,బ్లూషీట్స్ లను స్పెషల్? డ్రైవ్? నిర్వహించి తొలగించారు.వ్యాపారాల వల్ల ఫుట్ పాత్ ఉపయోగించి నడక సాగించే పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.నిత్యం రద్దీగా ఉండే బెంగళూరు హైవే నుంచి శాస్త్రిపురం మీదుగా వట్టేపల్లి వై జంక్షన్ వరకు అక్రమంగా రోడ్డుపైకి వచ్చిన దుకాణాలను, డబ్బాలను కూల్చివేశారు.రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వాణిజ్య సంస్థలు ఏర్పాటు చేసుకున్న వారిపై చర్యలు తీసుకున్నారు.జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య 208 ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించారు.కాసేపు జీహెచ్‌ఎంసీ సిబ్బందికి, స్థానికులకు తీవ్ర వాగ్వివాదం జరగడంతో కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసుల సహాయంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఫుట్ పాత్ లపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేశారు.

**ఫుట్ పాత్ లు ఆక్రమిస్తే చర్యలు తప్పవు...**

ఫుట్ పాత్ లు ఆక్రమణలపై సహించేది లేదని, ఇలాంటి ఉల్లంఘనలు గుర్తిస్తే ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు తెలియజేయాలని సూచించారు.రోడ్లను ఆక్రమించి డబ్బాలు,బండ్లు, టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ప్రణాళిక విభాగం ఏసిపి శ్రీధర్ తెలిపారు.మరోసారి ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఏసిపి హెచ్చరించారు.ఫుట్ పాత్ లు కేవలం పాదాచారుల కొరకు నిర్మించడం జరిగిందని వాటిని ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని తెలిపారు.

## కల్వకుంట్ల కవితను కలిసిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



**మంథని/పెద్దపల్లి, నవంబర్09 (సూర్యరేఖ)** రాబోవు కాలంలో వచ్చే అన్ని ఎన్నికల్లో బీఆర్ ఎస్ పార్టీ గెలుపు లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్సీ కల్లకుంట్ల కవిత మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ కు సూచించారు శనివారం కుటుంబ సమేతంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్ లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యకర్తలను సమన్వయం చేసుకొని పార్టీ బలోపేతానికి శ్రమించాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయాలనీ చర్చించినట్లు తెలిపారు. ఇప్పటికిప్పుడు ఏ ఎలక్షన్ పెట్టినా బిఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.కార్యకర్తలు ఎవరూ కూడా అధైర్య పడవద్దని, వచ్చే ఎన్నికల్లో రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. వారి వెంట మంథని మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ,శ్రీహర్షలు ఉన్నారు.

## జిల్లాస్థాయి ఫుట్ బాల్ యువ జ్యోతి క్రీడాకారుల ప్రభంజనం



**రామాయంపేట,నవంబర్09(సూర్య రేఖ)** గత ఆరు సంవత్సరాలుగా ఫుట్ బాల్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ లో తర్ఫీదు పొందుతున్న అండర్ 12,అండర్14,అండర్17 యువజ్యోతి ఫుట్బాల్ అకాడమిక్ క్రీడాకారులు ప్రభంజనాలు సృష్టిస్తున్నారు. వరుసగా నాలుగు సంవత్సరాల నుండి అసోసియేషన్ యువజ్యోతి క్రీడాకారులు ఫుట్ బాల్ క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి,జాతీయ స్థాయిలకు ఎంపిక కావడం జరుగుతుంది.ముచ్చటగా మూడవసారి యువజ్యోతి ఫుట్ బాల్ అకాడమీ క్రీడాకారుడు శరత్చంద్ర బులెట్ రెండు, జాతీయ ఫుట్బాల్ అండర్ 14 లో ప్రాతినిధ్యం వహించడంతోపాటు శుక్రవారం జరిగిన మెదక్ ఎస్ జి ఎఫ్ జిల్లా ఫుట్బాల్ నుంచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం జరిగింది.అతనితో పాటు భాను మనోహర్ క్రీడాకారుడు రాష్ట్రస్థాయి మహబూబ్నగర్ జిల్లా వనపర్తి లో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్బాల్ క్రీడలకు ఎంపిక కావడం పట్ల మెదక్ ఫుట్బాల్ అసోసియేషన్ సెక్రెటరీ నాగరాజు,రామాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట రాజా గౌడ్,మెదక్ ఫుట్బాల్ స్టేడియం గర్ల్స్ కోచ్ భాగ్యమ్మ ప్రకాష్,రామాయంపేట యువజ్యోతి ఫుట్బాల్ అకాడమీ కోఆర్డినేటర్ కోచ్ సత్యనారాయణలు అభినందించారు.

## రాష్ట్రస్థాయి పోటీలను సందర్శించిన బెల్లంపల్లి ఆర్డీఓ,ఏసీపీ





**బెల్లంపల్లి,నవంబర్9(సూర్య రేఖ)** క్రీడలు యువతలో పోటీ తత్వం, శారీరిక దురత్తంతో పాటు చెడు అలవాట్లకు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడానికి దోహదపడతాయని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ,ఏసీపీ రవికుమార్లు అన్నారు. బెల్లంపల్లిలోని బాలగంగాధర్ తిలక్ స్టేడియంలో ఎస్జీఎఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు మూడు రోజులు కొనసాగనున్న నేపథ్యంలో శనివారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ పోటీలను సందర్శించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువత క్రీడల్లో బాగా రాణించి భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీఐ దేవయ్య,పోలీస్ అధికారులు జిల్లా పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి సమగ్ర సర్వేకు సహకరించండి





**మున్సిపల్ ఆధ్వర్యంలో సమగ్ర సర్వే**

**రామాయంపేట,నవంబర్9(సూర్య రేఖ)** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను రామాయంపేట మున్సిపల్లో విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.దేవేందర్ అన్నారు.మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులలో 28 మంది ఎన్యుమరేటర్లను నియమించి వారికి శిక్షణ తరగతులు నిర్వహించారు.శుక్రవారం వరకు డోర్ టూ డోర్ స్టిక్కర్ అతికించి శనివారం నుండి ప్రతి ఇంటికి తిరుగుతూ సమగ్ర కుటుంబ సర్వే యొక్క వివరాలను తెలియజేశారు. అందులో భాగంగా మున్సిపల్ నుంచి ఎన్యుమరేటర్ సిబ్బందికి ఫారంలు అందజేసి వార్డులలో సర్వేకు పంపించామన్నారు.సర్వే పూర్తి అయ్యేవరకు ప్రతి ఇంటి వద్ద ఇంటి యజమాని ఓపికతో వివరాలు తెలుసుకొని రోజువారి సర్వే రిపోర్ట్ ను సూపర్‌వైజర్లకు అందజేయాలని ఆదేశాలను జారీ చేశారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్,ఆర్ఐ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ డ్రైయిన్ పనులను పరిశీలించిన కౌన్సిలర్ బండి ప్రభాకర్





**బెల్లంపల్లి,నవంబర్09(సూర్య రేఖ)** అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రత్యేకంగా ప్రాధాన్యతను ఇస్తున్నామని బెల్లంపల్లి మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ బండి ప్రభాకర్ అన్నారు. శనివారం గంగారం నగర్ లో మురికి నీటి కాలువ,సీసీ డ్రైనేజీ సమస్య ప్రధానంగా తమ వార్డులో ఉందని అక్కడి ప్రజలు 13వ వార్డు కౌన్సిలర్, బండి ప్రభాకర్ దృష్టికి తీసుకురాగా వెంటనే కౌన్సిలర్ స్పందించారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యను వెంటనే పరిష్కరించి గంగారం నగర్ లో వెంటనే పనులను ప్రారంభించారని అక్కడి ప్రజలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండి ప్రభాకర్ మాట్లాడుతూ..తమ వార్డులో ఉన్న ఏ సమస్యనైనా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటిని పరిష్కరించడానికి తాను ఎల్లవేళలా వారికి తోడుంటానని తెలిపారు. చెప్పిన వెంటనే ప్రజల సమస్యను విని వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం గాంధీ నగర్,కాల్ టెక్స్ ఏరియాలో శనివారం ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ రజిత అంగన్వాడి టీచర్ ఉమా,సూపర్వైజర్ రాంబాబు వార్డు సభ్యులు ఏఎం సలీం,ముజీబ్ ఖాన్,అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు..




**నిజాంపేట,నవంబర్09(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ ఆధార్ సెంటర్ లో ఐదు సంవత్సరాల పైబడి ఉన్న చిన్నారులకు ఆధార్ కార్డు నమోదు చేసుకోవాలన్నారు.ఆధార్ కార్డులో ఏమైనా తప్పిదాలు ఉంటే సరి చేసుకోవచ్చన్నారు.రోజుకు 20 మంది చొప్పున ఆధార్ వివరాలు సేకరిస్తామని ఈ అవకాశాన్ని మండల గ్రామ ప్రజలు సద్వినియం చేసుకోవాలన్నారు.

## మానవతా దృక్పథంతో దొరికిన సెల్ ఫోన్ ను బాధితునికి అప్పగించిన కానిస్టేబుల్




**నిజాంపేట,నవంబర్09(సూర్యరేఖ)** మండల కేంద్రంలో శుక్రవారం జనగామకు చెందిన శోభన్ బాబు రామాయంపేట నుండి బస్సులో వస్తుండగా తన మొబైల్ ఫోన్ పడిపోవడం జరిగింది. పడిపోయిన ఫోను సిఐడి హైదరాబాద్ కానిస్టేబుల్ సిద్ధ రాములుకు దొరకగా మానవత దృక్పథాన్ని చాటుతూ దొరికిన సెల్ ఫోన్ ను నిజాంపేట పోలీసు స్టేషనులో బాధితుడికి పిలిచి ఫోన్ అప్పగించడం జరిగింది.దీంతో పలువురు కానిస్టేబుల్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సునీత,కానిస్టేబుల్ విజయ్ ఉన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ తిరిగి బాధితునికి అప్పగించిన ఎస్సై శ్రీనివాస్ రెడ్డి




**నిజాంపేట,నవంబర్09(సూర్యరేఖ)**మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన ఆకుల రమేష్ గౌడ్ తన ఫోన్ ను ఆటోలో వెళ్తుండగా మార్గ మధ్యలో పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే నిజాంపేట పోలీస్ స్టేషన్ లో సంప్రదించి ఫిర్యాదు చేయగా సిఈఐఆర్ వెబ్సైట్ ద్వారా ట్రాప్ చేసి బాధితునికి మొబైల్ ఫోన్ అందజేయడం జరిగిందని ఎస్సై శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లయితే పోలీస్ స్టేషన్లో దరఖాస్తు చేసుకున్నట్లయితే సిఈఐఆర్ యాప్ ద్వారా పోయిన పోన్ ట్రాప్ చేసి తిరిగి పొందవచ్చున్నారు.

## ఇంట్లో గొడవ పడి బయటకు వెళ్లిన యువతిని కుటుంబ సభ్యులకు అప్పగించిన

**రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు**



**రాజేంద్రనగర్,నవంబర్08** ఇంట్లో గొడవ పడి బయటకు వెళ్లిన ఓ యువతిని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు వారి తల్లిదండ్రులకు అప్పగించారు.వివరాల ప్రకారం నారాయణపేట్ జిల్లాకు చెందిన భక్య అనూష(20),వెంకట్‌రాములు భార్యభర్తలు. బతుకుదెరువు కోసం నార్సింగిలో జీవనం సాగిస్తున్నారు.కాగా శుక్రవారం రాత్రి ఇంట్లో తల్లిదండ్రులతో గొడవ పడిన అనూష ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. అనూష అరాంఘర్ చౌరస్తాలో తిరుగుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు గుర్తించి ఆ యువతిని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి అప్పగించారు.దీంతో ట్రాఫిక్ పోలీసులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

## వన దుర్గామాతను దర్శించుకున్న జిల్లా జ్యూడిషల్ న్యాయమూర్తి



**రామాయంపేట నవంబర్ 9 (సూర్య రేఖ)** ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల వన దుర్గ భవాని మాతను శనివారం రోజు జిల్లా జ్యుడీషియల్ న్యాయమూర్తి సిరి సౌజన్య దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పూర్ణకుం భంతో, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. మండల ఎస్సై శ్రీనివాస్ గౌడ్‌తో పాటు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సమగ్ర సర్వేను ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించాలి





**సర్వేకు ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధం..**
**డీఈఓ సుశీందర్ రావు**

**రాజేంద్రనగర్,నవంబర్08** కులగణన సర్వే కార్యక్రమాన్ని ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించాలని డీఈఓ సుశీందర్ రావు అధికారులకు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వే నేపథ్యంలో ఎంఈవో శంకర్ రాథోడ్,సూపర్వైజర్ స్వరూపరాణిలకు పలు సూచనలు చేశారు.అత్తాపూర్ ప్రాంతంలో సర్వే నేపథ్యంలో ఆయన అధికారులతో ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అందరూ కుల గణనలో పాల్గొనాలని తెలిపారు.ఏవైనా ఇబ్బందులు తలెత్తితే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి సర్వేను విజయవంతం చేయాలని సూచించారు.ఈ మేరకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసిందని వెల్లడించారు.ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలన్నారు.ప్రభుత్వ పథకాల సద్వినియోగం పరిపాలన,ప్రజల స్థితిగతుల గురించిన ప్రాథమిక వివరాలను అందరూ ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధమయంతి, చంద్రశేఖర్, సుమలత,శ్రీనివాస్,సౌమ్య శ్రీ పాల్గొన్నారు.

# ఎంపీడీవో ప్రధాన ద్వారానికి తాళం





**కార్యాలయానికి దారి ఎటో తెలియక లబ్ధిదారులు, ప్రజల తికమక...**
**నల్ల పోచమ్మ పక్కనున్న ప్రధాన దారికి వాహనాల అడ్డంకి...**
**చుట్టూ తిరిగి పోతున్న లబ్ధిదారులు అధికారులు..**

**రామాయంపేట,నవంబర్09(సూర్య రేఖ)** రామాయంపేట మండలానికి అభివృద్ధికి మూలస్థానంగా ఉన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సౌకర్యాలు అగమ్యగోచరంగా మారాయని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. తమ తమ దరఖాస్తులు,సమస్యలు నివేధించడానికి కార్యాలయానికి వెళ్ళవలసిన ప్రధాన ద్వారం కొంతకాలంగా తాళం వేసి ఉండడం విశేషం.పక్కనే దుకాణాల యజమానులు, ప్రజలు మలమూత్ర విసర్జనకు వాడుకుంటున్నారని అధికారులు కారణంగా తెలుపుతుండటం, అందుకోసమే తాళాలు వేసామని చెప్పడం విచిత్రంగా ఉంది.నల్ల పోచమ్మ దేవాలయం పక్కన ఉన్నదారిలో మురుగు కాలువ నిర్మించి కనీసం ద్విచక్ర వాహనాలు కూడా పోవడానికి ఆస్కారం లేకపోవడంతో ఈ సమస్య గందరగోలంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమస్యలు వచ్చినా పరిష్కరించ కుండా తాళాలు వేస్తే సమస్య పరిష్కారం అవుతుందా అని ప్రశ్నిస్తున్నారు.కానీ మొత్తానికి మొత్తం ప్రధాన దారికి తాళాలు వేసి చోద్యం చూస్తుండటం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.అధికారుల వైనం అర్థం కావడం లేదనీ ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా దారి గేటు ఓపెన్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా మండల నిధులు ఖర్చుచేసి పొదలు గడ్డి, పిచ్చి మొక్కలతో నిర్మానుష్య స్థలాలుగా మారిన కార్యాలయ వాతావరణాన్ని మార్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీష్ రావు






**చిన్న ఘనపూర్ లో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించడం నా అదృష్టం**
**మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే హరీష్ రావు వ్యాఖ్య**




**కొల్చారం,నవంబర్09(సూర్య రేఖ)** కొల్చారం మండలం చిన్న ఘనాపూర్ గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నానని మాజీమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్న ఘనపూర్ గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని శనివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, ఎస్సీ ఎస్టీ మాజీ కమిషనర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్సీ సేరి సుభాష్ రెడ్డితో కలిసి హరీష్‌రావు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహించిన యువతకు, గ్రామ పెద్దలకు,గ్రామ ప్రజలకు అభినందనలు తెలిపారు. తెలంగాణ తల్లి మన ఉద్యమానికి నిత్యం స్ఫూర్తినిచ్చేదని,ఆ తల్లి దీవెనలతో తెలంగాణ రాష్ట్రం వచ్చిందని హరీష్ రావు అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్,మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్,ఎమ్మెల్యే మాణిక్ రెడ్డి,ఎస్సీ ఎస్టీ మాజీ కమిషనర్ ఎర్రోళ్ల శ్రీనివాస్,కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా,యువత విభాగం అధ్యక్షులు తుంకలపల్లి సంతోష్ రావు,యువ నాయకుడు రవితేజ రెడ్డి,ముత్యం ప్రవీణ్ కుమార్,మాజీ డిసీస్ చైర్మన్ ఎస్ నరేందర్ రెడ్డి,సొసైటీ డైరెక్టర్ బాగా రెడ్డి,బైకర్ శ్రీకాంత్,సోమ నర్సింలు,ఆరే రవీందర్,మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ముత్యం గారి మేఘమాల సంతోష్ కుమార్,మాజీ ఎంపీపీ అధ్యక్షులు కోరబోయిన మంజుల కాశీనాథ్,పోతంశెట్టిపల్లి మాజీ సర్పంచ్ కొమ్ముల యాద గౌడ్,చిన్న ఘనపూర్ మాజీ సర్పంచ్ ఇందిర ప్రియదర్శిని సందీప్,ఎరుకల రత్నయ్య,విగ్రహ దాత ఎరుకల కిష్టయ్య,సొసైటీ వైస్ చైర్మన్ పి రాజు గౌడ్,కొల్చారం మండలం బీఆర్ఎస్ కార్యకర్తలు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జోగులాంబ గద్వాల్ జిల్లా బీజేపీ సంస్థాగత ఎన్నికల వర్క్‌షాప్..

**సభ్యత్వ కార్యశాల వర్క్ షాప్..**
**సభ్యత్వ నమోదులో గద్వాల్ అగ్రస్థానంలో నిలవాలి..**
**గద్వాల్ బీజేపీ ఎన్నికల సంస్థాగత వర్క్ షాప్ లో బీజేపీ నాయకుడు బొక్క బాల్ రెడ్డి పిలుపు**



**రాజేంద్రనగర్,నవంబర్08** భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదులో గద్వాల్ జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టేలా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ నాయకుడు, జోగులాంబ గద్వాల్ బీజేపీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ బొక్క బాల్ రెడ్డి పిలుపునిచ్చారు.మహాబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు,బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణమ్మ ప్రోత్సాహం జోగులాంబ గద్వాల్ జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ డీకే స్నిగ్ధ కృషి ఫలితంగా జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు జోరుగా జరగడం చాలా సంతోషం అని వ్యాఖ్యానించారు.200 మంది సభ్యులను క్రియాశీలంగా బీజేపీలో నమోదు చేయిస్తే మండల,జిల్లా స్థాయిలో నాయకులుగా తయారు అయ్యే అవకాశం ఉంటుందని అన్నారు.త్వరలో బీజేపీ సంస్థాగత ఎన్నికలు వస్తున్న తరుణంలో జిల్లా కార్యకర్తలు, నాయకులు మరింత ఉత్సాహంతో పని చేసి,ఎక్కువ మంది ప్రజలకు బీజేపీ పథకాలని, మోడీ నాయకత్వాన్ని చేరువ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు రామచంద్ర రెడ్డి,జిల్లా మోర్చా అధ్యక్షులు,సోషల్ మీడియా అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి,బీజేపీ ఎలక్షన్ ఇంచార్జ్ రామాంజనేయులు,శివారెడ్డి,రామచందర్ రెడ్డి,దేవదాస్,కేకే రెడ్డి, రాజశేఖర్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోజుకో ముసుగులో సైబర్ వల -లింక్స్ పై క్లిక్ చేశారా అంతే..!

**మందమరి ఎస్సై రాజశేఖర్**



**బెల్లంపల్లి,నవంబర్ 09 (సూర్యరేఖ)** మీ మొబైల్ వాట్సప్ లకు వచ్చే గుర్తుతెలియని ఏపీకే అప్లికేషన్లను క్లిక్ చేయడం వల్ల సైబర్ నేరస్తుల వలలో చిక్కుకునే అవకాశం ఉందని మందమర్రి ఎస్సై రాజశేఖర్ అన్నారు.మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో గల చిర్రకుంట గ్రామానికి చెందిన మాసినేని రాజేందర్ అనే వ్యక్తి వాట్సాప్ కి అక్టోబర్ 9వ తేదీన ఒక ఏపీకే ఫైల్ రాగా,అతను చూసుకోకుండా క్లిక్ చేయడంతో తన మొబైల్ పై అతను నియంత్రణ కోల్పోయి,అతనికి తెలియకుండానే తన బ్యాంక్ అకౌంట్ నుండి రూ.50 రూపాయలు పోయినట్టు అతనికి మెసేజ్ రాగా,వెంటనే అతను సైబర్ మోసానికి గురైనట్టు తెలుసుకొని,1930 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి తన ఫిర్యాదు నమోదు చేసుకున్నాడు.అట్టి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మందమరి ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## దళితుల ఐక్యత కోసం మాలల మహా పాదయాత్ర విజయవంతం చేయాలి..

**మాలల మహా పాదయాత్ర సమీక్ష సమావేశం..**
**రాష్ట్ర పొలిటి బ్యూరో చైర్మన్ ర్యాకాం శ్రీరాములు**



**చెగుంట,నవంబర్09(సూర్యరేఖ)** ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం మాలల మహా పాదయాత్ర విజయవంతం చేయాలని రాష్ట్ర పొలిటి బ్యూరో చైర్మన్ ర్యాకాం శ్రీరాములు పిలుపునిచ్చారు.ఈ మేరకు చేగుంట మండల కేంద్రంలోని ఆర్ అండ్ బిగెస్ట్ హౌస్ లో మాల మహానాడు నాయకుడు ఎగడి శేఖర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ర్యాకం శ్రీరాములు మాట్లాడుతూ...ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ అక్టోబర్ 25 నుంచి తెలంగాణ రాష్ట్ర మాలల మహా పాదయాత్ర పాదయాత్ర భద్రాచలం నుండి మొదలైన హైదరాబాద్ వరకు కొనసాగుతుందని,ఈ మహాపాదయాత్ర మెదక్ జిల్లాకు 23న చేరుకుంటుందని అక్కడినుండి 24న పాదయాత్రగా రామాయంపేట నర్సింగ్ మీదుగా చేగుంట చేరుకుంటుందని అని తెలిపారు.మాలల పాదయాత్రకు చుట్టుపక్కల మండలాల అన్ని గ్రామాల మాల సోదరులు మాల బాంధవులు పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునీచ్చారు.అనంతరం గెస్ట్ హౌస్ లో వాల్ పోస్టర్లు,కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కల్లూరు సంజీవ, జిల్లా కార్యదర్శి దుబాసి సంజీవ్,మండలలా అధ్యక్షులు బండారు చంద్రయ్య,బైరం సిద్ధిరాములు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు రావు,జిల్లా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఊరట్ల శివ,జిల్లా యూత్ అధ్యక్షులు నరేష్,జిల్లా ఉపాధ్యక్షులు ఆనంద్, నర్సాపూర్ మండల అధ్యక్షులు గోవు యాదగిరి, ద్యాగల ఎల్లం,నీరుడు మహిపాల్ మండల బాధ్యులు మాణిక్యం సంజీవ్,ఎగ్గడిమాణిక్యం,కందరి బాబు, ఆయా మండలాల మలమాడు నాయకులు పాల్గొన్నారు.

# సర్వేలో నిర్లక్ష్యం సహించేది లేదు







**సమగ్ర సర్వేను సమర్థవంతంగా నిర్వర్తించాలి..**
**ఇంటింటి సర్వేను పరిశీలించిన**
**దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న**

**రాజేంద్రనగర్,నవంబర్ 09** సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న కోరారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ ప్రేమావతిపెట్, రాజేంద్రనగర్,మైలార్ దేవులపల్లిలో ప్రారంభమైన సామాజిక, ఆర్థిక,విద్య,ఉపాధి,రాజకీయ,కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వివరాలు సేకరించే ఎన్యుమరేటర్లు ఏ విధంగా వివరాలు సేకరిస్తున్నారు.ఎలా ఫారాలు నింపుతున్నారు.అని ఆయన అనేది సరి చూశారు.సిబ్బంది ఎవరు కూడా నిర్లక్ష్యం వహించకుండా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేను అన్ని వివరాలు సేకరించాలని చెప్పారు.అనంతరం జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ...ఇంటింటి సర్వేలో సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచుతామని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.ప్రతి రోజూ ఆకస్మిక తనిఖీల ద్వారా సర్వేను పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఒక్క ఇంటిని కూడ వదలకుండా ప్రతి ఇంటిని సర్వే చేయాలనీ అన్నారు. ప్రతి ఒక ఇంటిలో ఎంత మంది కుటుంబ సభ్యులు,ఎన్ని కుటుంబాలు ఉన్నాయన్న వివరాలు పొందు పరచాలన్నారు. ఇంటి నెంబర్ లేని ఇండ్లు ఉన్నాయా,ఏమైనా సమస్యలున్నాయా అని అడిగారు.సర్వే కోసం వచ్చిన ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని ఇచ్చి సహకరించాల్సిందిగా ఇంటి సభ్యులను కోరారు.రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక,విద్య, ఉపాధి, రాజకీయ,కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు.తప్పుడు సమాచారం ఇవ్వకుండా సరైన సమాచారం ఇవ్వాలన్నారు.

# కోలాహలంగా మాలల ఆత్మీయ సమ్మేళనం





**మాలలు ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చు**
**ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తా**
**భారీ ర్యాలీతో బయలుదేరిన మాలలు**
**30 లక్షల మాలల కోసం ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా సైనికుల ముందుకు రావాలి**
**ముఖ్య అతిథిగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్**

**ఇబ్రహీంపట్నం,నవంబర్9(సూర్యరేఖ)** మాల మాదిగలను విభజించడానికి కుట్రలు పన్నుతున్నారని, మాలలను ఐక్యంచేసి ఏకతాటిపైకి తీసుకొచ్చి ఆత్మీయ సమ్మేళనంలో ఎన్ని ఎత్తులు వేసిన అబద్ధం నిజం కాదని వర్గీకరణ జరగనివ్వమని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని శాస్త్ర గార్డెన్ లో మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం మాలల ఇబ్రహీంపట్నం ఐక్యవేదిక కన్వీనర్ మారయ్య, కో కన్వీనర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మాలలు ఈ ఆత్మీయ సమ్మేళనం తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ..ఏబీసీడీ వర్గీకరణ రాజ్యాంగం బద్దంగా రావాలని, మనువాద వర్గీకరణ వద్దని అన్నారు.జాతి నిర్మాణం కోసం అన్ని వర్గాలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు.హక్కుల సాధన కోసం విభేదాలను పక్కన పెట్టాలని అన్నారు. హక్కుల సాధన కోసం అందరూ సైనికుల్లా ఉద్యమించాలని అన్నారు.30 లక్షల మాలల కోసం జరిగే జాతి పోరాటంలో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా సైనికుల్లా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.మాల ఉద్యోగులను వేధిస్తే ఊరుకునేదని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఎలిమినేయర్ విధానాన్ని పునః సమితించాలని కోరారు.ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బుద్ధవనం ఓ ఎస్ డి మల్లేపల్లి లక్ష్మయ్య,ప్రముఖ కార్డియాలజిస్ట్ ఎంఎఫ్ గోపీనాథ్,ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సర్వయ్య,సమతా సైనిక్ దళ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దిగంబర్ కామ్లే, ఉద్యమకారుడు ప్రజా గాయకుడు రేంజర్ల షాన్ రాజేష్, మాల మహానాడు నాయకుడు చెన్నయ్య, స్థానిక నాయకులు టి ఐక్యవేదిక కో కన్వీనర్లు ఈ.రాములు, భర్తకి జగన్, హనుమన్ల కిష్టయ్య,ఆవుల మల్లేష్,చిలకల బుగ్గ రాములు, ఎస్పీఆర్ మల్లేష్,టి బాలచందర్,డాక్టర్ అబ్బయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ రాజరాజేశ్వర సహస్రార్జున మహారాజ్ జయంతి వేడుకలు

**ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ డాక్టర్ గురు ప్రసాద్ సుల్తాన్ పూర్కర్**

**రాజేంద్రనగర్,నవంబర్08** శ్రీ రాజరాజేశ్వర సహస్రార్జున మహారాజ్ జయంతిని అత్యంత భక్తి శ్రద్ధలతో, ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకోవడం సంతోషంగా ఉందని ప్రముఖ డాక్టర్ గురు ప్రసాద్ సుల్తాన్ పూర్కర్ అన్నారు. రాజేంద్రనగర్ ఎస్ఎస్ కె సమాజ్ ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర సహస్రార్జున మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పట్కర్ (ఖత్రి) సమాజ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ. పురాణయోధుడు,కులదైవం, మూలపురుషుడైన మాహిష్మతి రాజ్య మహా చక్రవర్తి శ్రీ సహస్రార్జున మహారాజు జయంతి ఉత్సవాన్ని ప్రతి ఏడాది కార్తీక మాసంలో జరుపుకుంటారని గుర్తు చేశారు.శ్రీ మహావిష్ణువు సుదర్శన చక్ర అవతారమైన శ్రీ రాజరాజేశ్వర సహస్రార్జున మహారాజు ఈ భువిపై చెడును అంతమొందించి, ధర్మాన్ని నిలబెట్టడానికి అవతరించారని వివరించారు.మహాబలశాలి అయిన సహస్రార్జునుడి గుణగణాలను శ్లాఘిస్తూ,ఆయన వంశానికి చెందిన ఎస్ఎస్ కియాన్స్ తమ మేధో నైపుణ్యాలు,శక్తి సామర్థ్యాలను పయోగించి,వివిధ రంగాలలో అభివృద్ధి చెందుతున్నారన్నారు. రాజేంద్ర నగర్ సమాజం ప్రజలందరూ చేయి చేయి కలుపుతూ సమాజం నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో పాల్గొని ఐక్యతను చాటుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఉమేష్ చవాన్,ముఖ్య కార్యదర్శి రాజేష్ హబీబ్,సంయుక్త కార్యదర్శి మహేష్ చవాన్,కమిటీ సభ్యులు రమాకాంత్ హౌజి, సలహాదారులు రామలాల్ చవాన్,గాంబో నాగరాజ్, రాజ్ కుమార్ జ్యోతి,దత్తారాం పడాల్ సీనియర్ జర్నలిస్ట్,డాక్టర్ దివాన్ రాకేష్,మహిళా విభాగం అధ్యక్షురాలు గాయత్రి చవాన్,సంయుక్త కార్యదర్శి శారదా హబీబ్, దాదాపు 150 మంది పట్కర్ (ఖత్రి) సభ్యులు పాల్గొన్నారు.



## జాతీయస్థాయి క్రీడలకు వేదికగా మారిన చేగుంట

**జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు అయితే పరంజ్యోతి**




**చేగుంట,నవంబర్09(సూర్య రేఖ)** జాతీయ స్థాయిలోని వివిధ క్రీడలకు మెదక్ జిల్లా చేగుంట వేదికగా మారిందని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు అయితే పరంజ్యోతి పేర్కొన్నారు. మండల కేంద్రమైన చేగుంటలోని ఆదర్శ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా ఎస్ జి ఎఫ్ వాలీబాల్ సెలక్షన్ ఎంపికలను పిఈటి జిల్లా అధ్యక్షులు నాగరాజు,రాష్ట్ర యోగ కోచ్ కరణం గణేష్,ప్రిన్సిపల్ చంద్రకళ ఆధ్వర్యంలో శనివారం ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పరంజ్యోతి మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు మెదక్ జిల్లా చేగుంటలో జరగడం, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు అయిన తన ఆధ్వర్యంలో జరగడం ఎంతో సంతోషకరమని,గతంలో చేగుంటలో జరిగిన వివిధ ఫెన్సింగ్, యోగ తదితర క్రీడల్లోజిల్లా రాష్ట్ర జాతి స్థాయిలో నిలిచారని,అదేవిధంగా ఈనెల 16,17,18 జరగబోయే ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో మెదక్ జిల్లా నుంచి జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని జిల్లాను ముందు ఉంచాలని పరంజ్యోతి కోరారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రకళ,రాష్ట్ర యోగ కోచ్ కర్ణం గణేష్ రవికుమార్,పీఈటీల జిల్లా అధ్యక్షుడు నాగరాజు,పీఈటీలు శంకర్,అలీ నరేష్,శంకర్,విష్ణు,శ్రీనివాస్,శారద,జూకంటి రాజు గౌడ్,అయితే వెంకటలక్ష్మి రఘు రాములు తదితరులు ఉన్నారు.

## సమగ్ర సామాజిక ఆర్థిక కుల గణన సర్వేను ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



**సిద్దిపేట,నవంబర్09(సూర్య రేఖ)** సిద్దిపేట జిల్లా కుకునూరు పల్లి మండల కేంద్రంలో జరుగుతున్న సమగ్ర సామాజిక, ఆర్థిక,విద్య,రాజకీయ కుల గణన సర్వేకు ప్రజలు సహకరించాలని సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. శనివారం ఆయన సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు అడిగిన సమాచారం అందించి సర్వేకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్యుమరేటర్లు ప్రజల నుంచి సామాజిక,ఆర్థిక,రాజకీయ,విద్య,కుల సమాచారాన్ని నిర్దిష్ట నమూనాలొ పొందుపరచాలని ఆదేశించారు.సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కుకునూరుపల్లి మండల తహశీల్దార్ మల్లికార్జున్ రెడ్డి,కొండపాక ఎంపిఓ విష్ణు మండల ఆర్ఐ సత్యనారాయణ, గ్రామపంచాయతీ సిబ్బంది ముస్త్యాల రాజు,మేకల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి..

**యువతీయువకులు ఓటు హక్కు కలిగి ఉండాలి..**
**రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్**





**రాజేంద్రనగర్,నవంబర్ 09** ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, 18 సంవత్సరాలు నిండిన యువతీ,యువకులు తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదును పురస్కరించుకొని ఆకస్మిక తనిఖీ చేపట్టారు. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవులపల్లి ప్రభుత్వ పాఠశాల లోని పోలింగ్ బూత్ నంబర్ 329,330,331లలో ఓటరు నమోదు జాబితా సమగ్ర పరిశీలనపై సంబంధిత బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు.18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు హక్కు కలిగి ఉండాలని,దానికి సంబంధిత బీఎల్వోలు ఇంటింటి సర్వే చేపట్టి ఓటు నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు.బస్తీలల్లో ఇప్పటివరకు మరణించిన వారితో పాటు నూతనంగా ఓటరు నమోదు జాబితాపై ఆరా తీశారు.ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా అర్హులైన నూతన ఓటర్లను గుర్తించి,ఓటర్ల జాబితాలో వారి పేర్లు నమోదు చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రతీఒక్కరు వినియోగించుకోవాలని తెలిపారు సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ప్రతి ఇల్లు తప్పకుండా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు.

# అసలుకే లేదు అయ్యా అంటే... పెసరపప్పు వెయ్యు అన్న చందంగా మారిన కాంగ్రెస్ ప్రభుత్వం







**ప్రజాపాలననా రాక్షస పాలన... కాంగ్రెస్ ప్రభుత్వం పై విరుచుకుపడ్డ మాజీ మంత్రి హరీష్ రావు....**

**కొల్చారం రైతు దీక్షలో పాల్గొన్న హరీష్ రావు..**

**కొల్చారం,నవంబర్09(సూర్య రేఖ)** కాంగ్రెస్ పార్టీ పాలకులు గాలి మోటార్లలో... ధాన్యం పండించిన రైతులు రోడ్లపైన... ఆరు గ్యారంటీల బాండ్ల పేరుతో.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం... ఇదేనా మీ పాలన... రైతులపై కక్ష సాధింపు పాలన.... చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు విరుచుకుపడ్డారు. మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారంలో శనివారం రైతు దీక్షకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు దీక్షకు హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను ఎగ్గొట్టి రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన అన్నారు.వర్షాకాలం వరిధాన్యం కోసి నెల రోజులు గడిచినప్పటికీ ఇప్పటివరకు 50 శాతం కూడా ధాన్యం కొనుగోలు చేయడం లేదని,30 శాతం వరిధాన్యం దళారుల పాలు అయ్యిందన్నారు.ఇచ్చిన హామీలలో ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా బూతు పురాణం మాటలు నేర్చుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించిన వారిపై బూతు పురాణాలు మాట్లాడటం తప్ప ఆయనకు రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు ఇచ్చిన పాపాన పోలేదని,మహిళలకు రూ.2500 ఇస్తానని చెప్పి పది నెలలు గడుస్తున్న హామీలు పత్తా లేకుండా పోయిందన్నారు.వృద్ధులకు నెలకు రూ.4 వేలు పింఛనిస్తానని చెప్పి,ఇప్పటివరకు 11 నెలలు కలుస్తున్న వృద్ధులకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.22 వేల బాకీ ఉందని, చేతగాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందని అన్నారు.ఈ కార్యక్రమానికి హాజరైన కవి దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మాయమాటల కాంగ్రెస్.. నమ్మించి మోసం చేశారని, మన బతుకులను ఆగం ఆగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఎవరు నమ్మవద్దని దేశపతి శ్రీనివాస్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హాయంలో రైతులకు రైతుబంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పలు పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందని దేశపతి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..కొల్చారం మండలంలో ఈ గ్రామాల్లో చూసిన దాన్యం కుప్పలు అలాగే ఉన్నాయని అవి చూసి కూడా కాంగ్రెస్ నాయకులకు కనికరం లేకుండా పోయిందని,కనీసం రైతులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పలకరించిన పాపాన పోలేదని అన్నారు.ఆడపిల్ల పెండ్లిలకు ఆపద్బాంధవుడుగా ఆదుకున్న కళ్యాణ లక్ష్మి ఇస్తే,కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్యాణ లక్ష్మి రూపాయలతో సహా తులం బంగారం ఇస్తామని చెప్పి ఒక్క మహిళలకు ఇచ్చిన దాఖలాలు లేవని ఆమె అన్నారు.సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తానని చెప్పి,ఇప్పుడు వారి ధాన్యం కోసి నెల గడుస్తున్న కొనుగోలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం, అసలుకే లేదురా అయ్యా అంటే.. పెసరపప్పు ఏయు అన్న చందంగా మారిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతి కిరణ్,పద్మ దేవేందర్ రెడ్డి,సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, ఎమ్మెల్సీ సేరి సుభాష్ రెడ్డి,ప్రజా గాయకుడు దేశపతి శ్రీనివాస్,మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా,యువత విభాగం అధ్యక్షుడు తుంకలపల్లి సంతోష్ రావు,ముత్యం ప్రవీణ్ కుమార్,మాజీ ఎంపీపీ మంజుల కాశీనాథ్,మాజీ జెడ్పిటిసి సభ్యురాలు మేఘమాల సంతోష్ కుమార్,మాజీ డిసిసి చైర్మన్ ఎస్ నరేందర్ రెడ్డి,కొమ్ముల యాద గౌడ్,ఆరే రవీందర్,కొమ్ముల సురేష్ గౌడ్, ఇంద్రసే నారెడ్డి,మాజీ జెడ్పిటిసి పాశం శ్రీనివాస్ రెడ్డి,కొల్చారం మాజీ సర్పంచ్ ఉమా రాజా గౌడ్,యువ నాయకుడు రవితేజ రెడ్డి, కొల్చారం మండలం మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు, వివిధ హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు,అన్ని గ్రామాల రైతులు,కొల్చారం మండల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు..

**షబ్బీర్ అలీ**



**కామారెడ్డి,నవంబర్ 09 (సూర్యరేఖ)** రైతు సోదరులు ధరలను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మాజీమంత్రి షబ్బీర్ అలీ అన్నారు.కామారెడ్డి నియోజకవర్గ బిక్నూర్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు తాటిపత్రి,ప్యాడి క్లియర్ మ్యాచూరు మిషన్లను పంపిణీ చేశారు.అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ... సన్న వడ్లకు క్వింటానికి రూ.500 లు బోనస్ ఇస్తున్నామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని,ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని రైతులను కోరారు.రైతు సంక్షేమంలో భాగంగా మద్దతు ధర నిర్ణయించినట్లు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రభుత్వం చేస్తుందన,కొనుగోలు కేంద్రాల నుండి వడ్లను తరలించడానికి ట్రాన్స్పోర్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిక్నూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి,సొసైటీ చైర్మన్లు సిద్ధ రాములు,కిష్టా గౌడ్ తోపాటు రైతులు పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వే దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది..

**ప్రతిపక్షాల దుష్ప్రచారాలను తిప్పికొట్టండి సర్వేకు సహకరించండి..**

**క్షేత్రస్థాయిలో సిబ్బంది వెంట స్థానిక నాయకులు ఉండి అనుమానాలను నివృత్తి చేయండి..**

**చేగుంటలో ఇంటింటి సర్వే తీరును పరిశీలించిన మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్**



**చేగుంట,నవంబర్09 (సూర్యరేఖ)**రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ప్రారంభించిన సమగ్ర కుటుంబ సర్వే దేశానికి ఆదర్శమని, ఈ సర్వే వల్ల ప్రజల స్థితి గతులతో పాటు అన్ని రకాలుగా లబ్ది చేకూరే అవకాశం ఉంటుందని మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ అన్నారు. శనివారంపట్టణ కేంద్రం లో సమగ్ర కుటుంబ సర్వే జరుగు తున్న తీరును క్షేత్రస్థాయిలో పర్య టించి వివరాలు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం లో భాగంగా సామాజిక,ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వేపై ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని,వాటిని నివృత్తి చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. సూపర్ వైజర్లకు ఎన్యూమరేటర్లకు స్థానిక నాయకులు అందుబాటులో ఉండి ప్రతి పక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొడుతూ సర్వేపై ప్రజలకు ఎలాంటి అపోహలు లేకుండా చూడాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. సర్వే ప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యూమరేటర్లు భాద్యతగా వ్యవహరించాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వే చాలా మంచి కార్యక్రమమని, ప్రజల సమగ్ర సమాచారం సేకరణ వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి రాజకీయ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు.సర్వేపై కొన్ని పార్టీలు దుష్ప్రచారాలను చేస్తున్నారని వాటిని ప్రజలు నమ్మవద్దని కోరారు.

## పోలవరం ప్రాంతవాసులకు కష్టాలే..

**ఏలూరు :** ఆ ఊరు దేశం యావత్తు ప్రజలకు తెలుసు.. పర్యాటకులు అక్కడి నుంచి లాంచీలు ఎక్కుతుంటారు. ప్రధాని నుంచి మంత్రుల వరకు అక్కడేం జరుగుతోందని ఆరా తీస్తుంటారు. వారం వారం ముఖ్యమంత్రి కూడా ఆ ఊరు విజిట్ చేస్తుంటారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారులు నిరంతరం పర్యటిస్తుంటారు. ఇంత గొప్ప పేరున్న ఆ ఊరు చివరకు ఎటూ కాకుండా పోతుంది. వ్యాపారాల్లేవు. పనులు లేవు. అన్నీ వలసలే. బహుళార్ధ సాధక నీటి ప్రాజెక్టు ఆ ఊరి పేరు మీదే దేశవ్యాప్తంగా సుపరిచితం అయింది. అయితే ఏంటంటారా, పేరు గొప్ప ఊరు దిబ్బ అని అంటున్నారు ఆ ఊరు వాళ్ళు. ఆ ఊరే జాతీయ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మిస్తున్న పోలవరం. పోలవరానికి అభివృద్ధి అందని ద్రాక్ష అయింది.పోలవరం ప్రాజెక్టుతో ఊళ్లకు ఊళ్లు ఖాళీ అయిపోయాయి. వందలాది ఎకరాలు భూసేకరణలో పోయింది. ఉపాధి కరువై పొట్ట చేత పట్టుకొని వలసలు పోవాల్సిన దుర్భర పరిస్థితులు దాపరించాయి. కూలి పనులు లేక పనులు కోసం పొరుగూళ్లకు పరిగెడుతున్నారు. పూట గడవని గట్టు పరిస్థితులు నెలకొంటున్నాయి. వ్యాపారాలు లేక దుకాణాలన్నీ వెలవెలబోతున్నాయి. ఈ పరిస్థితులకు తోడు ఆకాశాన్నంటుతున్న ధరలతో పేద,మధ్యతరగతి ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. జీవన ప్రమాణాలు దిగజారిపోతున్నాయి. ప్రాజెక్ట్ తో పోలవరం ప్రాంత వాసుల ముఖ చిత్రాలు పూర్తి గా మారిపోతున్నాయి.లక్షలాది ఎకరాలకు సాగునీరు, కోట్లాది మంది ప్రజలకు తాగునీరు అందుతుందని, రాష్ట్రం సస్యశ్యామలంగా మారుతుందని ప్రాజెక్టును ప్రజలు స్వాగతించారు. ప్రాజెక్టు పూర్తయి పోలవరం అభివృద్ధి చెందుతుందని కలలుగన్నారు. కానీ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాలేదు.. సరికదా పోలవరం ప్రాంతవాసుల జీవితాలలో కష్టాలు, కన్నీరు మిగిల్చింది. పోలవరం ప్రాజెక్టుతో ఏజెన్సీ గిరిజన గ్రామాలన్ని ప్రభుత్వం ఖాళీ చేయించింది. వేలాదిగా నిర్వాసితులు పునరావాసాలకు తరలివెళ్లిపోయారు. ఏజెన్సీలోని వందలాది ఎకరాల సాగులో లేకుండా ఉన్నాయి. ఈ ప్రభావం నేరుగా మండల కేంద్రం పోలవరం మీద పడి బతుకులకు భద్రత లేకుండా పోయింది. పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు, పట్టిసీమ ఎత్తిపోతలకు పథకానికి, ప్రాజెక్టులో వచ్చిన వ్యర్థమైన మట్టిని డంప్ చేయడానికి, నిర్వాసితుల పునరావాస గ్రామాల నిర్మాణానికి వందలాది ఎకరాలను సేకరించింది. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది.వ్యవసాయ కూలీలకు పనులు సరిపడా లేకుండా పోయిందని కుంజం నాగబాబు, పెంటా పోసియ్య, ముళ్ల కేదరి, దేరా భద్రమ్మ, వల్లూరి సూర్యకుమారి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలకు, గ్రామాలు ఖాళీ చేసి పునరావాస గ్రామాలకు వేలాది మంది తరలిపోవడంతో అన్ని రకాల వ్యాపార దుకాణాలు కొనేవారు లేక వెలవెలబోతున్నాయి. దీనివల్ల వ్యాపారస్తులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని నాళం గాంధీ, మండవల్లి బాబ్జి, బెజవాడ రామకృష్ణ, కోరసిక నాగబాబు, భవన నిర్మాణ కార్మికులు, పెయింటర్స్ పనులు కోసం

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ని కలిసిన ఉద్యమకారులు

**తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి..**

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు కొంతం యాదిరెడ్డి**



**తుర్కయంజాల్,నవంబర్09(సూర్యరేఖ)**ఉద్యమకారులకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని కేంద్రమంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు బండి సంజయ్‌కుమార్‌ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి ఆధ్వర్యంలో బండి సంజయ్‌ని పలువురు నాయకులు శనివారం కలిశారు.ఈ సందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ... నాడు తెలంగాణ కోసం,నేడు తెలంగాణ ఉద్యమకారుల కోసం,అలుపెరుగని పోరాటం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర సాధనలో కవులను, కళాకారులను, మేధావులను, ఉద్యమకారులను ఎవరు పట్టించుకునే వారు లేక తీవ్రమైన నిరుపేదారికమును అనుభవిస్తూ జీవనం సాగిస్తున్నామని అన్నారు.ప్రత్యేక రాష్ట్రం కోసం వీరోచితంగా పోరాడిన నాయకులను ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందించాలని, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నాయకులు అమలు చేయాలని కోరారు.ప్రతి ఉద్యమకారునికి 250 గజాల స్థలం,పెన్షన్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడంతో ఎంతోమంది కృషి ఉందని వారందరికీ కాంగ్రెస్ పార్టీ గుర్తించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బొక్క నర్సింహారెడ్డి,బోసుపల్లి ప్రతాప్,బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్,నాయకులు తూళ్ల నర్సింహ గౌడ్,ఉద్యమకారులు పి.బాలయ్యగౌడ్, కె.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి సమగ్ర సర్వేకు సహకరించాలి

**టెస్కాబ్ వైస్ చైర్మన్,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య**



**తుర్కయంజాల్,నవంబర్09 (సూర్యరేఖ)** మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామనగర్ కాలనీలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు శనివారం టెస్కాబ్ వైస్ చైర్మన్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి చైర్మన్ కొత్త కుర్మా సత్తయ్య నివాసంలో అధికారులకు సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వివరాలు అందజేశారు.మాజీ సర్పంచ్ కొత్తకుర్మ కళమ్మ కుటుంబ సభ్యులు సమగ్ర సర్వేలో పాల్గొన్నారు. అనంతరం కొత్త కుర్మా సత్తయ్య మాట్లాడుతూ.. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక,కుల సర్వేతో వెనుకబడిన వారికి చేయూత అందించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిందన్నారు. సంక్షేమ పథకాలు మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం,రైతు రుణమాఫీ 500 రూపాయలకే గ్యాస్,10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ,200 యూనిట్లు కరెంటు బిల్ ఫ్రీ,ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తుందని అన్నారు. అధికారులతో సహాయక చర్యలు కులగననకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి టూ గ్రౌండ్ లో లక్ష దీపోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు



**బెల్లంపల్లి,నవంబర్09(సూర్యరేఖ)** బెల్లంపల్లిలోని టు గ్రౌండ్లో కార్తీక లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ చైర్మెన్ అన్నారు. ఈ నెల 11 వ తేదీ సాయంత్రం ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో కార్తీక లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు.శనివారం మున్సిపల్ ఛైర్ పర్సన్ ఆధ్వర్యంలో ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్లు ముఖ్య అతిథులుగా హాజరై కొబ్బరికాయ కొట్టి కార్యక్రమం ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ మాట్లాడుతూ..లక్ష దీపోత్సవం కార్యక్రమం, 11 వ తేదీన జరుపుటకు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శనివారం పనులను ప్రారంభించి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ హరికృష్ణ,ఏసీపి రవికుమార్,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మునిమందా రమేష్ భూపల్లి రాజేశ్వరి,కౌన్సిలర్లు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలను సందర్శించిన బెల్లంపల్లి ఆర్డీఓ, ఏసీపీ



**బెల్లంపల్లి,నవంబర్9(సూర్య రేఖ)** క్రీడలు యువతలో పోటీ తత్వం, శారీరిక దురత్తంతో పాటు చెడు అలవాట్లకు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడానికి దోహదపడతాయని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ,ఏసీపీ రవికుమార్లు అన్నారు.బెల్లంపల్లిలోని బాలగంగాధర్ తిలక్ స్టేడియంలో ఎస్జీఎఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు మూడు రోజులు కొనసాగనున్న నేపథ్యంలో శనివారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ పోటీలను సందర్శించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ..యువత క్రీడల్లో బాగా రాణించి భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీఐ దేవయ్య,పోలీస్ అధికారులు జిల్లా పీఈటీలు,పీడీలు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,